E KABURU - Digital News Paper
E-PAPER
ఈ-కబురు
@ekaburu.com
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
హైదరాబాద్ (తేదీ) 25-05-2026 (వారం) సోమవారం సంపుటి: 02 || సంచిక:142|| పేజీలు–6
www.ekaburu.com

తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

03

తెలంగాణకు రూ.9,968 కోట్లు

- టాయించిన 16వ ఆర్థిక సంఘం
- 2026-27 నుంచి 2030-31 వరకు వినియోగించాలని నిర్దేశం
- కేంద్రం మార్గదర్శకాలు జారీ

ఈ-కబురు, హైదరాబాద్: కేంద్ర 16వ ఆర్థిక సంఘం తెలంగాణకు రూ.9,968 కోట్లను కేటాయించింది. 202627 నుంచి 203031 వరకు ఈ నిధులను నిర్దేశించింది. వాటి వినియోగం, పర్యవేక్షణ, పారదర్శకతపై కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది.

02

శాంతికి సిద్ధం

- యురేనియంపై దిగొచ్చిన ఇరాన్!
- నిల్వలను వదులుకునేందుకు అంగీకారం?
- అమెరికాతో దాదాపు ఖాయమైన శాంతి ఒప్పందం
- క్రమంగా తెరుచుకోనున్న హర్మూజ్
- 60 రోజుల కాలావధిలో అన్ని అంశాలపై కూలంకషంగా చర్చించాలని నిర్ణయం
- లెబనాన్‌లోనూ ముగియనున్న యుద్ధం

ఈ-కబురు

కైరో: పశ్చిమాసియా సంక్షోభానికి ఇక తెరపడినట్లే! అమెరికాఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. అగ్ర రాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు నుంచీ డిమాండు చేస్తున్నట్లు.. శుద్ధి చేసిన యురేనియం నిల్వలను వదులుకునేందుకు టెహ్రాన్ అంగీకరించినట్లు తెలుస్తోంది. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడటం లేదని ప్రపంచానికి భరోసా ఇచ్చేందుకు సిద్ధమంటూ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తాజాగా ఓ వార్తా సంస్థతో ముఖాముఖిలో వ్యాఖ్యానించడం దీన్ని బలపరుస్తోంది. ముందుగా శాంతి ఒప్పందం కుదుర్చుకుని.. ఆపై 60 రోజుల కాలావధిలో అందులోని అంశాలపై ఇరు దేశాలు కూలంకషంగా చర్చించే అవకాశాలున్నాయి. చర్చలు క్రమ పద్ధతిలో, నిర్మాణాత్మకంగా సాగుతున్నాయని ట్రంప్ ఆదివారం 'ట్రూత్ సోషల్'లో తెలిపారు.

మిగతా 2లో

మద్దతు ధర ప్రకటనకే కేంద్రం పరిమితమా?

- మేం సేకరించిన మొత్తం ధాన్యాన్ని ఎందుకు కొనరు?
- భాజపా నేతలు జవాబు చెప్పాలి
- మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి డిమాండ్
- కొనుగోళ్లు 7-10 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్లకు ఆదేశాలు
- రైతులకు గత ప్రభుత్వం కంటే వేగంగా చెల్లింపులు: డిప్యూటీ సీఎం భట్టి

ఈకబురు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ధాన్యం విషయంలో మద్దతు ధర ప్రకటనకే పరిమితమవుతోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకే తాము కొంటున్నామని.. ఆ మొత్తం ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు.

02

03

సీఎంతో తమిళనాడు మంత్రి విశ్వనాథన్ భేటీ

ఈ-కబురు, హైదరాబాద్: ఇటీవల తమిళనాడులో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే విశ్వనాథన్.. ఆదివారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసానికి వచ్చి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా

మార్కెట్ ఒడుదొడుకులకు శాంతి

శ్చిమాసియా పరిణామాలు, కార్పొరేట్ ఫలితాలు కీలకం
ఎఫ్ఎమ్‌సీజీకి ఒత్తిడి, టెలికాం, ఐటీ, సిమెంటు షేర్లకు సానుకూలతలు, విశ్లేషకుల అంచనాలు
మార్కెట్లకు బక్రీద్ సెలవు గురువారం

04

ఉచిత విద్యుత్తు రద్దుకే మీటర్లు

కేసుల భయంతో మోదీకి తలొగ్గిన సీఎం రేవంత్‌రెడ్డి
భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపణ

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలో ఉచిత విద్యుత్తు రద్దులో భాగంగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. అదానీ, అంబానీలకు చెందిన ప్రైవేట్ సంస్థలు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను రాష్ట్రవ్యాప్తంగా అమర్చనున్నాయని, బిల్లులు చెల్లించకుంటే విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. కేసుల భయంతోనే ప్రధాని మోదీ ఒత్తిడికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తలొగ్గి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ఆదివారం ఛేనంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారాస అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గ బూత్ స్థాయి ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. నాడు రూ.30 వేల కోట్ల రుణాన్ని రాష్ట్రానికి ఇవ్వకుండా ఆపినా సరే భారాస అధినేత కేసీఆర్ కేంద్రం ఒత్తిడికి తలొగ్గకుండా ఉచిత విద్యుత్తును కొనసాగించారని గుర్తుచేశారు.

మిగతా 2లో

బుల్లెట్ వేగంతో..

ఏపీ అభివృద్ధి

- విశాఖ, మంగళగిరి–తాడేపల్లికి కేంద్రం గ్రీన్ సిగ్నల్
- యూసీఎఫ్‌తో విశాఖ అభివృద్ధికి కొత్త దిశ
- ప్రతి ఇంటికీ డిజిటల్ ఆరోగ్య సేవలు
- ఉద్యాన సాగు విస్తరణకు చర్యలు
- సాగునీటి ప్రాజెక్టులకు క్యాలెండర్ సిద్ధం
- గ్రీన్ కవర్ పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్



03

భారత్‌తో ఘర్షణపడే ఉద్దేశం లేదు

వాణిజ్య ఒప్పందం ఉభయులకూ మేలు: రూబియో
వీసాలపై ఆందోళన వ్యక్తం చేసిన జైశంకర్

02

ఫోన్ కాల్‌తో లైవ్‌లోకి ట్రంప్.. మోదీపై ప్రశంసలు

ఈకబురు,
భారత ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ చాలా గ్రేట్ అని అభివర్ణించారు. ఆయనకు తాను పెద్ద అభిమానినని పేర్కొన్నారు. అమెరికా ఈ ఏడాది 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించుకోనుంది. ఈనేపథ్యంలో భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రూబియో ఆధ్వర్యంలో ఆ దేశ ఎంబసీ దిల్లీలో ఓ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఫోన్ కాల్ ద్వారా అధ్యక్షుడు ట్రంప్ లైవ్‌లోకి వచ్చి మాట్లాడారు.

02

మక్కల కొనుగోళ్లకు మాది 'గ్యారంటీ'!

- మార్క్‌ఫెడ్‌కు రూ.1867 కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇస్తూ సర్కారు నిర్ణయం
- ఇప్పటికే రూ.4,173 కోట్ల మేర గ్యారంటీ
- ఇచ్చి, రూ.3,100 కోట్ల విలువైన మక్కల కొనుగోలు

03

గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవాలి

03

రాజస్థాన్‌దే ఆఖరి అడుగు

06

దిల్లీ ముగించింది విజయంతో..

ఫోన్ కాల్‌తో లైవ్‌లోకి ట్రంప్.. మోదీపై ప్రశంసలు

ఈకబురు, భారత ప్రధాని మోదీపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ (Donald Trump) ప్రశంసల వర్షం కురిపించారు. మోదీ చాలా గ్రేట్ అని అభివర్ణించారు. ఆయనకు తాను పెద్ద అభిమానినని పేర్కొన్నారు. అమెరికా ఈ ఏడాది 250వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించుకోనుంది. ఈనేపథ్యంలో భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ శాఖ మంత్రి రూబియో ఆధ్వర్యంలో ఆ దేశ ఎంబసీ దిల్లీలో ఓ కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా ఫోన్ కాల్ ద్వారా అధ్యక్షుడు ట్రంప్ లైవ్‌లోకి వచ్చి మాట్లాడారు.

''భారత ప్రధాని మోదీ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన చాలా గ్రేట్. నాకు మంచి మిత్రుడు. ఇంతకుముందు కంటే ఇప్పుడు ఇండియా మాకు చాలా దగ్గరైంది. భారత్ మా దేశంపై 100 శాతం ఆధారపడవచ్చు. ఏ సహాయం కావాలన్నా.. ఎవరిని సంప్రదించాలో వారికి తెలుసు. ఎలాంటి సహాయం కోసమైనా వారు మాకే ఫోన్ చేస్తారు. ప్రస్తుతం అమెరికా రికార్డులు సృష్టిస్తోంది. మాకు రికార్డు స్థాయి ఆర్థిక వ్యవస్థ ఉంది. భారత్ ఏది కావాలనుకుంటే అది దక్కుతుంది. నేను మోదీకి చాలా పెద్ద అభిమానిని'' అని ట్రంప్ పేర్కొన్నారు. రూబియోను సైతం ట్రంప్ ప్రశంసించారు. అమెరికా చరిత్రలోనే అతను గొప్ప విదేశాంగ మంత్రి అని వెల్లడించారు.

మరోవైపు అమెరికా, భారత్‌లు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని ఖరారు చేసుకునేందుకు దగ్గరలోనే ఉన్నాయని మార్కో రుబియో ఆదివారం వెల్లడించారు. ఈ ఒప్పందంతో ఇరుదేశాలకు ప్రయోజనం చేకూరుతుందని, రెండు దేశాల జాతీయ ప్రయోజనాలకు ఇది అనుగుణంగా ఉంటుందని తెలిపారు.

భారత్‌తో ఘర్షణపడే ఉద్దేశం లేదు

ఈకబురు, దిల్లీ: వాణిజ్యంపై భారత్‌తో ఘర్షణకు దిగే ఉద్దేశం అమెరికాకు ఎంతమాత్రం లేదని ఆ దేశ విదేశాంగశాఖ మంత్రి మార్కో రూబియో స్పష్టంచేశారు. అధ్యక్షుడు ట్రంప్ పాటిస్తున్న విధానం.. ప్రపంచంతో అమెరికా చేస్తున్న వాణిజ్యాన్ని సరి చేయడానికే తప్ప నిర్దిష్టంగా ఏ దేశానికీ వ్యతిరేకం కాదని తెలిపారు. వాణిజ్యంలో అసమతౌల్యాన్ని సరిచేసి, వ్యవస్థ ముందుకు వెళ్లేలా చూడాలనేదే ఆయన ఉద్దేశమని వివరించారు. అమెరికాభారత్ వాణిజ్య ఒప్పందం ఖరారైతే అది సుస్థిరంగా, ఉభయ దేశాలకూ లాభదాయకంగా ఉంటుందన్నారు. ఆయన ఆదివారం దిల్లీలో భారత విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జైశంకర్‌తో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం వారిద్దరూ విలేకరులతో మాట్లాడారు.

భారత్‌తో బంధాన్ని పణంగా పెట్టబోం

త్వరలోనే తమ వాణిజ్య ప్రతినిధి భారత్‌కు వస్తారని రూబియో తెలిపారు. వాణిజ్య ఒప్పందాల వల్ల అమెరికాకే కాకుండా భాగస్వామ్య దేశాలకూ మంచిదని చెప్పారు. 'భారత్‌తో ఒప్పందం కొలిక్కి రాబోతోంది. భారత్ భారీ ఆర్థిక వ్యవస్థ. దీనిలో అమెరికా ప్రధాన భాగస్వామి. ఇలాంటి పెద్ద దేశంతో వ్యాపారంలో అసమానతల్ని సరి చేసుకోవాల్సి ఉంటుంది. రెండు దేశాల బంధాన్ని ఎన్నడూ లేనంత బలంగా తీర్చిదిద్దాలనేది మా సంకల్పం' అని రూబియో వివరించారు. చైనా, పాకిస్థాన్‌లతో అమెరికా సంబంధాలు బలపడుతుండటంపై విలేకరుల ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. భారత్‌తో ఉన్న వ్యూహాత్మక బంధాన్ని పణంగా పెట్టేలా ఇతర దేశాలతో సంబంధాలను అమెరికా చూడబోదన్నారు.

మధ్యంతర వాణిజ్య ఒప్పందం తుది ముసాయిదా వీలైనంత త్వరగా సిద్ధమవుతుందని జైశంకర్ ఆశాభావం వ్యక్తంచేశారు. చట్టబద్ధ వలసలకు రక్షణ కల్పించాలని అమెరికాను కోరారు. వీసా, వలసల విధానంలో ట్రంప్

శాంతికి సిద్ధం

కైరో: పశ్చిమాసియా సంక్షోభానికి ఇక తెరపడినట్లే! అమెరికాఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. అగ్ర రాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ముందు నుంచీ డిమాండు చేస్తున్నట్లు.. శుద్ధి చేసిన యురేనియం నిల్వలను వదులుకునేందుకు టెహ్రాన్ అంగీకరించినట్లు తెలుస్తోంది. తాము అణ్వాయుధం కోసం వెంపర్లాడటం లేదని ప్రపంచానికి భరోసా ఇచ్చేందుకు సిద్ధమంటూ ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ తాజాగా ఓ వార్తా సంస్థతో ముఖాముఖిలో వ్యాఖ్యానించడం దీన్ని బలపరుస్తోంది. ముందుగా శాంతి ఒప్పందం కుదుర్చుకుని.. ఆపై 60 రోజుల కాలావధిలో అందులోని అంశాలపై ఇరు దేశాలు కూలంకషంగా చర్చించే అవకాశాలున్నాయి. చర్చలు క్రమ పద్ధతిలో, నిర్మాణాత్మకంగా సాగుతున్నాయని ట్రంప్ ఆదివారం 'ట్రూత్ సోషల్'లో తెలిపారు. చాలా విషయాలపై సంప్రదింపులు ముగిశాయన్నారు. అయితే ఒప్పందం కోసం తొందరపడొద్దని.. చర్చల్లో పాల్గొంటున్నవారికి తాను సూచించినట్లు చెప్పారు. ఇరుపక్షాలూ తగినంత సమయం తీసుకుని, పొరపాట్లు ఏమీ లేకుండా చూడాలన్నానని పేర్కొన్నారు. ఒప్పందం కుదిరి, సంతకాలు పూర్తయ్యేదాకా ఇరాన్ ఓడరేవుల దిగ్బంధనాన్ని తాము కొనసాగిస్తామని ట్రంప్ స్పష్టం చేశారు. టెహ్రాన్‌తో తమ బంధం మరింత ప్రొఫెషనల్‌గా, ఫలప్రదంగా మారుతోందని వ్యాఖ్యానించారు. చర్చల్లో గణనీయ పురోగతి ఉందని భారత పర్యటనలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో వ్యాఖ్యానించారు. ఇరాన్ అణ్వస్త్రాలను తయారు చేసుకుంటుందని ప్రపంచం ఇంకెంత మాత్రమూ భయపడాల్సిన అవసరం ఉండబోదన్నారు.

ఒప్పందంలో ఉండే అంశాలివీ..

అమెరికాఇరాన్ చర్చల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఇద్దరు అధికారుల కథనం ప్రకారం..

60% శుద్ధి చేసిన యురేనియం ఇరాన్‌వద్ద 440.9 కిలోల మేర ఉంది. దాన్ని ఇరాన్ త్యజిస్తుంది. అయితే ఆ ప్రక్రియ ఎలా సాగుతుందనేది 60 రోజుల్లో జరిగే చర్చలపై ఆధారపడి ఉంటుంది. కొంత యురేనియంను డైల్యూట్ చేసి, మిగిలిన మొత్తాన్ని తృతీయ దేశానికి అప్పగించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. హర్మూజ్‌ను ఇరాన్ క్రమంగా తెరుస్తుంది. అమెరికా తమ దిగ్బంధనాన్ని ఉపసంహరించుకునే కొద్దీ.. దానికి సమాంతరంగా ఈ జల సంధిని తెరిచే పనిని అది కొనసాగిస్తుంది. ఇరాన్‌పై ఆంక్షలను సడలించి.. అది చమురును విక్రయించేందుకు అమెరికా అనుమతిస్తుంది. ఆంక్షల తొలగింపు, జప్తు చేసిన ఇరాన్ ఆస్తుల విడుదల వంటి అంశాలను 60 రోజుల కాలావధిలో చర్చిస్తారు.

లెబనాన్‌లో ఇరాన్ మద్దతున్న హెజ్‌బొల్లా తిరుగుబాటుదారులకు, ఇజ్రాయెల్‌కు మధ్య జరుగుతున్న యుద్ధం కూడా ఈ ఒప్పందంతో ముగుస్తుంది.

మద్దతు ధర ప్రకటనకే కేంద్రం పరిమితమా?

ఈకబురు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం ధాన్యం విషయంలో మద్దతు ధర ప్రకటనకే పరిమితమవుతోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరకే తాము కొంటున్నామని.. ఆ మొత్తం ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఎందుకు తీసుకోవడం లేదని నిలదీశారు. ఈ విషయంలో భాజపా నేతలు జవాబు చెప్పాల్సిందేనన్నారు. ఏడాదిలో రెండు సీజన్లు కలిపి తెలంగాణలో రూ.75 వేల కోట్ల విలువైన ధాన్యం దిగుబడి వస్తోందన్నారు. ఇందులో సుమారు రూ.45 వేల కోట్ల విలువైన ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేస్తోందని.. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని స్పష్టం చేశారు. రబీ ధాన్యం సేకరణపై సివిల్ సప్లయిస్ భవన్ నుంచి ఉత్తమ్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పౌరసరఫరాలశాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, అధికారులు, రైస్‌మిల్లర్ల సంఘం నేతలు దేవేందర్‌రెడ్డి, నాగేందర్‌లతో కలిసి ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జిల్లా కలెక్టర్లు వివిధ ప్రాంతాల నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. సమావేశంలో, తర్వాత విలేకరులతోనూ మంత్రి ఉత్తమ్ మాట్లాడారు.

కేంద్రం తీరును ఎండగట్టాలి

'ప్రస్తుత రబీ సీజన్‌లో రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే 51 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.8,749 కోట్లు రైతులకు విడుదల చేసింది. ఇంకా మిగిలిన ధాన్యం కూడా కలిపి 75 లక్షల టన్నుల వరకు కొనబోతున్నాం. కేంద్ర ప్రభుత్వం మాత్రం 52 లక్షల టన్నుల కొనుగోలుకే అనుమతిచ్చింది. కేంద్రం వైఖరిపై మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా మాట్లాడాలి. తెలంగాణలోని మొత్తం పంటను కేంద్రం కొనడం లేదు. రానున్న వారం, పదిరోజుల్లో ధాన్యం సేకరణను కలెక్టర్లు పూర్తి చేయాలి. కేంద్రాల్లో ఇప్పటికే ఉన్న 8.5 లక్షల టన్నుల ధాన్యం యుద్ధప్రాతిపదికన కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలి. రానున్న పదిరోజులు అధికారులు ధాన్యం సేకరణపైనే దృష్టిపెట్టాలి. వర్షం వచ్చి తడిసినా ఆ ధాన్యాన్ని కొని బాయిల్డ్ రైస్‌మిల్లులకు తరలించాలి. ధాన్యం కొనుగోలు అంశంపై తప్పుడు ప్రచారాన్ని ఖండించాలి. ప్రతికూల వార్తలపై అధికారులు స్పందించాలి' అని ఉత్తమ్ ఆదేశించారు.

త్వరగా కొనుగోలు పూర్తిచేయాలి

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సరిపడా హమాలీల సంఖ్యను పెంచుకోవాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో వరి ధాన్యం కొనుగోలు నగదును రైతులకు చెల్లింపు విషయంలో నెలల తరబడి జాప్యమయ్యేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వెంటనే చెల్లింపులు చేస్తున్నామని స్పష్టం చేశారు. పట్టణాల అభివృద్ధిలో భాగంగా వాయు కాలుష్య నివారణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. వరి పంట కోసిన తర్వాత వ్యవసాయ వ్యర్థాలను కాల్చివేస్తున్నారని, రైతులకు వాయు కాలుష్య నివారణపై అవగాహన కల్పించాలని భట్టి సూచించారు.

లారీల కొరత..

మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో లారీల కొరత ఉందని, మిల్లర్లు తాలు, తరుగు పేరుతో 5శాతం కటింగ్ చేస్తున్నారని పేర్కొన్నారు. మిల్లుకు వెళ్లిన లారీ అన్‌లోడ్ అయ్యేందుకు 47 రోజులు పడుతోందన్నారు. రైతుల ప్రయోజనాలు కాపాడేందుకు కాంటా వేయగానే కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం లెక్కల్ని నమోదు చేయాలని చెప్పారు. రసీదు ఇవ్వకుంటే నిర్వాహకుల్ని తొలగించాలని, అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి మంత్రి ఉత్తమ్ స్పందిస్తూ రైతులకు.. మిల్లర్లు, వ్యాపారులు నష్టం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు. ఇసుక.. సిమెంటు పరిశ్రమల లారీలను కూడా తీసుకుని ధాన్యాన్ని తరలించాలన్నారు.

సమస్యలున్న జిల్లాలపై కలెక్టర్లు దృష్టి సారించాలి

సీఎస్ రామకృష్ణారావు మాట్లాడుతూ అంచనాల కంటే ధాన్యం అధికంగా వస్తోందని, సమస్య ఉన్న జిల్లాలపై కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ యంత్రాంగం ఎంతో కష్టపడుతోందని.. చివర్లో చెడ్డపేరు రాకుండా పదిరోజుల్లో సేకరణ పూర్తిచేయాలన్నారు. కొనుగోళ్లపై తప్పుడు ఆరోపణలు వస్తే దీటుగా స్పందించాలని, ప్రజలకు వాస్తవాలు తెలపాలన్నారు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రుల దృష్టికి కూడా వాస్తవాలను తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, నవీన్‌యాదవ్, శ్రీగణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్తు రద్దుకే మీటర్లు

ఈకబురు, హైదరాబాద్: రాష్ట్రంలో ఉచిత విద్యుత్తు రద్దులో భాగంగా వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ ఆరోపించారు. అదానీ, అంబానీలకు చెందిన ప్రైవేట్ సంస్థలు ప్రీపెయిడ్ స్మార్ట్ మీటర్లను రాష్ట్రవ్యాప్తంగా అమర్చనున్నాయని, బిల్లులు చెల్లించకుంటే విద్యుత్తు సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. కేసుల భయంతోనే ప్రధాని మోదీ ఒత్తిడికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తలొగ్గి రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రీపెయిడ్ మీటర్లు పెట్టాలని నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. ఆదివారం ఛేనంబర్ చౌరస్తాలోని ఓ ఫంక్షన్ హాలులో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారాస అంబర్‌పేట అసెంబ్లీ నియోజకవర్గ బూత్ స్థాయి ముఖ్య నేతలు, కార్యకర్తల సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. నాడు రూ.30 వేల కోట్ల రుణాన్ని రాష్ట్రానికి ఇవ్వకుండా ఆపినా సరే భారాస అధినేత కేసీఆర్ కేంద్రం ఒత్తిడికి తలొగ్గకుండా ఉచిత విద్యుత్తును కొనసాగించారని గుర్తుచేశారు.

''నగర అభివృద్ధిని పట్టించుకోకుండా లండన్, న్యూయార్క్ తరహాలో ఫ్యూచర్ సిటీ చేస్తామంటున్న రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరు. రూ.1,100 కోట్లతో కొండపోచమ్మ నుంచి గండిపేటకు కాలువ అనుసంధానం, రూ.4 వేల కోట్లతో మూసీనది మురుగునీటి శుద్ధికి 32 ఎస్టీపీలు, రూ.545 కోట్లతో మూసీ నదిపై 15 పైవంతెనల నిర్మాణం ఇలా అనేక అభివృద్ధి పనులను కేసీఆర్ హయాంలో చేపట్టారు. అప్పటి అభివృద్ధి పనులను ఇప్పుడు ప్రారంభించడం తప్ప సీఎం చేసిందేమీ లేదు.

మూసీ ప్రక్షాళన పేరుతో కూల్చివేతలు

భారాస పదేళ్ల పాలనలో రెండు పడక గదుల ఇళ్లు లక్ష నిర్మిస్తే.. ఈ రెండున్నరేళ్లల్లో ఒక్క ఇంటినీ కట్టకపోగా రూ.1.50 లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన, చెరువుల పునరుద్ధరణ అంటూ హైడ్రా పేరుతో బుల్‌డోజర్లను పంపి వేలాది పేదల ఇళ్లను కూలగొట్టారు. భారీ వ్యయంతో పనిలేకుండా కేవలం రూ.16 వేల కోట్లతో ఎవరికీ నష్టం కలగకుండా మూసీనదికి ఇరువైపులా రేవంత్‌రెడ్డి రోడ్లను నిర్మించాలి. ఓటమి భయంతోనే భాజపా ఓట్ల తొలగించేందుకు సిద్ధమైంది. భారాస బూత్ స్థాయి ఏజెంట్‌లు క్షేత్ర స్థాయిలో క్రియాశీలకంగా ఉండాలి.

డిసెంబరుజనవరిలో జీహెచ్ఎంసీ ఎన్నికలు

భారాస డిజిటల్ సభ్యత్వ నమోదు అనంతరం ప్రతి నియోజకవర్గం నుంచి 1,0001,200 మంది కార్యకర్తలకు శిక్షణ ఉంటుంది. డిసెంబరుజనవరిలో జీహెచ్ఎంసీ ఎన్నికలు ఉంటాయి. పనితీరు సర్వే ఆధారంగా టికెట్లు ఇస్తాం. పైరవీలు, సిఫార్సులకు చోటు లేదు'' అని కేటీఆర్ స్పష్టం చేశారు. మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్ సభ్యత్వ నమోదు ఇన్‌ఛార్జి కోలేటి దామోదర్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు రూ.9,968 కోట్లు

ఈకబురు, హైదరాబాద్: కేంద్ర 16వ ఆర్థిక సంఘం తెలంగాణకు రూ.9,968 కోట్లను కేటాయించింది. 202627 నుంచి 203031 వరకు ఈ నిధులను నిర్దేశించింది. వాటి వినియోగం, పర్యవేక్షణ, పారదర్శకతపై కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ మొత్తాన్ని గ్రామీణ స్థానిక సంస్థలైన గ్రామ పంచాయతీలు, మండల, జిల్లా ప్రజా పరిషత్‌లలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, వ్యర్థాల నిర్వహణ, గ్రామీణ రహదారులు, స్ట్రీట్ లైట్‌లు, ఇతర ప్రజా సేవల కోసం వినియోగించాలని పేర్కొంది. ఆయా గ్రాంట్లను వేతనాలు, పెన్షన్ చెల్లింపుల కోసం వినియోగించరాదని నిర్దేశించింది. ''ఎప్పటికప్పుడు వ్యయ వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. త్రైమాసిక, వార్షిక పురోగతి నివేదికలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించాలి. వాటి ఆధారంగా సమగ్ర నివేదికలను రాష్ట్రం.. కేంద్ర ప్రభుత్వానికి సమర్పించాలి. ఆడిట్‌లో గుర్తించిన లోపాలను తక్షణమే సరిదిద్దడానికి చర్యలు తీసుకోవాలి. అవకతవకలు లేదా నిధుల దుర్వినియోగం జరిగిందని తేలితే చట్టపరమైన చర్యలు చేపట్టాలి. వీటిపై పరిపాలన ఉత్తర్వులు జారీ చేయాలి'' అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.

పనితీరు ఆధారంగా...

ఐదేళ్ల కాలానికి ఆర్థిక సంఘం దేశం మొత్తానికి రూ.4,35,236 కోట్లను గ్రాంట్లుగా ఇస్తుంది. పంచాయతీలకు 80 శాతం; మండల, జిల్లా పరిషత్‌లకు 10 శాతం చొప్పున ఏటా రెండు సమాన విడతల్లో ఇవి విడుదలవుతాయి. ప్రతి ఆర్థిక సంవత్సరంలో జూన్‌లో మొదటి, అక్టోబరులో రెండో విడతగా నిధులు అందుతాయి. రాష్ట్రాలు.. స్థానిక సంస్థలకు ఏ మేరకు ఆర్థిక వనరులు సమకూరుస్తున్నాయనే అంశం ఆధారంగా రాష్ట్ర పనితీరును; పన్నుల వసూళ్లు, సొంత ఆదాయ వనరుల పెంపుదల ఆధారంగా పంచాయతీల పనితీరును పరిగణించి 20 శాతం నిధులివ్వడంపై కేంద్రం నిర్ణయం తీసుకుంటుంది.

2026 నాటి అంచనా ప్రకారం గ్రామీణ జనాభాకు 90 శాతం, రాష్ట్ర వైశాల్యానికి 10 శాతం వెయిటేజీ ప్రాతిపదికన నిధులు కేటాయించింది. ఇలా లెక్కేసినప్పుడు గ్రామీణ జనాభాకు 1.92 శాతం, తెలంగాణ వైశాల్యానికి 0.37 శాతానికి మొత్తం రూ.4,35,236 కోట్లలో రూ.9,968 కోట్లను ఆర్థిక సంఘం రాష్ట్రానికి కేటాయించింది.

మార్గదర్శకాల్లో ముఖ్యాంశాలు...

మొదటి విడత నిధుల కోసం.. రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధికి కేటాయించిన బడ్జెట్, 202526 ఆర్థిక సంవత్సరం ఆయా స్థానిక సంస్థల ఆడిట్ నివేదికలను సమర్పించాలి. మొదటి విడత నిధుల వినియోగ ధ్రువీకరణ, పురోగతి నివేదికల ప్రకారం రెండో విడత నిధులను కేంద్రం విడుదల చేస్తుంది. గ్రాంట్లు నేరుగా రాష్ట్ర ప్రభుత్వ ఖాతాకు వెళ్తాయి. వాటిని పది పనిదినాల్లో సంబంధిత గ్రామీణ స్థానిక సంస్థలకు బదిలీ చేయాలి.

రాజ్యాంగంలోని 9వ భాగం ప్రకారం సక్రమంగా ఎన్నికైన స్థానిక సంస్థలకే నిధులు విడుదలవుతాయి. నిర్దేశిత అవసరాలకు కేటాయించిన నిధులను వాటికే వెచ్చించాలి. వాటిని టైడ్ నిధులుగా వ్యవహరిస్తారు. అన్‌టైడ్ నిధులలో 20 శాతం కంటే ఎక్కువ నిధులను రోడ్ల నిర్మాణం, నిర్వహణ కోసం ఖర్చు చేయరాదు. నిధుల వినియోగంపై గ్రామ సభలో, మండల, జిల్లా ప్రజా పరిషత్ సమావేశాల్లో విధిగా తీర్మానం చేయాలి. వాటిని ఇగ్రామ్‌స్వరాజ్ పోర్టల్‌లో నమోదు చేయాలి.

కేటాయింపులు ఇలా...

సంవత్సరం	నిధులు (రూ.కోట్లలో)
2026–27	1,280
2027–28	1,633
2028–29	2,111
2029–30	2,343
2030–31	2,601
మొత్తం	9,968

బుల్లెట్ వేగంతో.. ఏపీ అభివృద్ధి

ఈకబురు,, అమరావతి :
ఏపీ సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం.. కేంద్రం నుంచి క్రమం తప్పకుండా నిధులు రాబడుతోంది. ప్రతి అవకాశాన్ని అందిపుచ్చుకుంటోంది. తాజాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ సాధించేందుకు ఏపీ ప్రభుత్వం చేసిన ప్రయత్నం సక్సెస్ అయింది.

విశాఖ, మంగళగిరి–తాడేపల్లికి కేంద్రం గ్రీన్ సిగ్నల్

తొలి విడతగా విశాఖపట్నం, మంగళగిరి - తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్లలో 1,990 కోట్ల రూపాయలతో ప్రతిపాదించిన నాలుగు తాగునీటి, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ప్రాజెక్టులను కేంద్రం ఆమోదించింది. ఇందులో యూసీఎఫ్ కింద కేంద్ర ప్రభుత్వం 497 కోట్ల రూపాయలు అలోకేట్ చేసింది. మిగతా నిధుల్లో 25% రెండు నగరపాలక సంస్థలు, మిగిలిన 50% మొత్తాలకు మున్సిపల్ బాండ్లు జారీ చేయనున్నారు. ప్రాజెక్టుల ద్వారా రెండు నగరాల్లోనూ ప్రజలకు మౌలిక సదుపాయాలు మరింత మెరుగవుతాయి. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కోసం రాష్ట్రం నుంచి 14 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులను ప్రతిపాదించారు.

యూసీఎఫ్‌తో విశాఖ అభివృద్ధికి కొత్త దిశ

అంచనా వ్యయంలో కేంద్ర ప్రభుత్వం 3,600 కోట్లు అంటే 25% అందించనుంది. ఐటీ, పారిశ్రామిక, డేటా హబ్‌గా ఎదుగుతున్న విశాఖలో మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం యూసీఎఫ్ నిధులు కేటాయించడం పాజిటివ్ వైబ్ గా మారింది. విశాఖలో రోజూ 4560 నిమిషాల పాటు ప్రజలకు పైపుల ద్వారా నీరు సరఫరా చేస్తున్నారు. పెరిగిన తాగునీటి అవసరాలతో రాబోయే రోజుల్లో 24 గంటలూ సరఫరా అయ్యేలా ప్రాజెక్టు చేపట్టనున్నారు. నగరంలో బల్క్ వాటర్ సరఫరా ప్రాజెక్టును ఆధునీకరించనున్నారు. రాజధాని అమరావతికి ఆనుకుని ఉన్న మంగళగిరితాడేపల్లిలో 33,842 ఇళ్లకు కనెక్షన్లు ఇచ్చేలా 303 కిలోమీటర్ల పొడవున అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను అందుబాటులోకి తేనున్నారు.

ఆరోగ్య భద్రతే లక్ష్యం..

ఏపీ ప్రజల ఆరోగ్య భద్రత లక్ష్యంగా చంద్రబాబు ప్రభుత్వం వైద్య రంగంలో సంస్కరణల దిశగా అడుగులు వేసింది. చిత్తూరు జిల్లా కండ్రిగ కేంద్రం సంజీవని ప్రోగ్రామ్ కు శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదికలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. ఆ తర్వాత సంతగేటు ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి రోగులకు అందుతున్న వైద్య సేవలను తెలుసుకున్నారు. సంతగేటు వద్ద నిర్వహించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశానికి హాజరయ్యారు.

ప్రతి ఇంటికీ డిజిటల్ ఆరోగ్య సేవలు

ఏపీలో వైద్యసేవలను సమర్థంగా అందించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత డిజిటల్ ఆరోగ్య వ్యవస్థే ఈ సంజీవని. ప్రతి ఒక్కరికీ హెల్త్ సర్వీసెస్ ను ఈజీ అందుబాటులోకి తేవడం, వ్యాధి నిర్ధారణ నుంచి కోలుకునే దాకా పర్యవేక్షించడం, అలాగే ముందస్తు పరీక్షలతో వ్యాధి తీవ్రత, మెరుగైన ఆరోగ్యసేవలు అందించడమే దీని ప్రధాన ఉద్దేశం. సంజీవని ప్రాజెక్టు ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 5.20 కోట్ల జనాభాకు డిజిటల్ హెల్త్ సర్వీసెస్ దగ్గర చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

ఉద్యాన సాగు విస్తరణకు చంద్రబాబు ఫోకస్

ఏపీలో కీలక సాగునీటి ప్రాజెక్టులను 2028లోపు పూర్తి చేయాలని భావిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం.. ఇందుకు కేంద్రం ప్రకటించిన పూర్వోదయ పథకంతో పాటు ప్రపంచ బ్యాంకు రుణం, ఇతర మార్గాల ద్వారా నిధుల సమీకరణకు ప్రయత్నిస్తోంది. రాయలసీమలో ఉద్యాన సాగును విస్తరించేందుకు సాగునీటి ప్రాజెక్టులను పూర్తిచేయాలనుకుంటోంది. పూర్వోదయలో హార్టికల్చర్ ప్రణాళిక కింద రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో సాగునీటి వసతి కల్పించి పంటల విస్తీర్ణం, ఉత్పత్తి పెంచాలని అనుకుంటోంది.

సాగునీటి ప్రాజెక్టులకు క్యాలెండర్ సిద్ధం

ప్రాజెక్టుల పూర్తికి ఇప్పటికే క్యాలెండర్‌ను రెడీ చేసింది. దాదాపు 25,884 కోట్లు వెచ్చించనుంది. విదేశీ ఆర్థిక సాయం, ప్రపంచ బ్యాంకు లోన్లతో రాయలసీమ ఉద్యాన హబ్‌ను ముందుకు తీసుకెళ్లాలని యోచిస్తోంది. దీనిపై డీపీఆర్ ను రెడీ చేసి కేంద్రానికి సమర్పించింది. అటు కేంద్ర ప్రభుత్వం తూర్పు భారతదేశ అభివృద్ధి పథకం కింద బిహార్, ఝార్ఖండ్, బెంగాల్, ఒడిశా, ఏపీలకు వర్తించేలా పూర్వోదయ పథకాన్ని బడ్జెట్‌లో ప్రతిపాదించింది. దీనికింద వ్యవసాయం, ఉద్యానం, రోడ్లు, మౌలిక సదుపాయాలు, పరిశ్రమల అభివృద్ధికి నిధులు ఇవ్వనుంది.

గ్రీన్ కవర్ పెంపుపై సీఎం చంద్రబాబు ఫోకస్

పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్రంలో గ్రీన్ కవర్ పెంపొందించే చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. త్వరలో చేపట్టే 2.50 కోట్ల సీడ్ బాల్స్ పంపిణీ కార్యక్రమం సక్సెస్ అయ్యేలా చూడాలని అటవీశాఖ అధికారులకు క్లారిటీ ఇచ్చారు. జూన్‌లో సీడ్ బాల్స్ రెడీ చేసి, జులై, ఆగస్ట్‌లో పంపిణీ చేయాలని సీఎం నిర్దేశించారు. ఇందులో విద్యార్థులు, ఉద్యోగుల నుంచి స్వచ్ఛంద సంస్థల వరకు అందరినీ భాగస్వాములను చేయాలన్నారు.

మత్స్యకారులతో సీఎం సమావేశం

మత్స్యకారుల సంక్షేమంపై స్పెషల్ ఫోకస్ పెట్టిన ఏపీ ప్రభుత్వం తాజాగా మత్స్యకారుల సేవలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నెల్లూరు జిల్లా కావలి నియోజకవర్గం తుమ్మలపెంట గ్రామంలో ఈనెల 19న నిర్వహించిన మత్స్యకారుల సేవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా తీరప్రాంతంలో నిరంతర పర్యవేక్షణ కోసం జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ ఫర్ సీ పెట్రోలింగ్ కేంద్రాన్ని సీఎం సందర్శించారు.

బోట్ల చొరబాటుపై కట్టుదిట్టమైన నిఘా

మెరైన్ పోలీస్, మత్స్యశాఖ, అటవీశాఖ, స్థానిక మత్స్యకారులతో సంయుక్తంగా సీ పెట్రోలింగ్ జాయింట్ యాక్షన్ టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేశారు. ఇతర రాష్ట్రాల మత్స్యకారుల బోట్లు చొరబడకుండా గస్తీ కోసం శాటిలైట్ చిత్రాల సాయం కూడా తీసుకోవాలని సీఎం నిర్దేశించారు. మత్స్యకారుల సేవలో బహిరంగ సభా వేదిక సమీపంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ, ఉద్యాన శాఖల స్టాళ్లను కూడా సీఎం చూశారు. అదే రోజు కావలి మండలం తుమ్మలపెంటలో తానంగారి బాబు అనే మత్స్యకారుడి కుటుంబంతో కలిసి వారి ఇంట్లో భోజనం చేశారు. మార్కెట్‌లో స్వయంగా చేపలు కొని మత్స్యకారుడి ఇంటికి వెళ్లి వండించుకుని తిన్నారు.

40 వేల మంది ఉద్యోగులతో సీఎం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్

జిల్లా కలెక్టర్లు, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, క్షేత్ర స్థాయి సిబ్బంది సుమారు 40 వేల మందితో సీఎం చంద్రబాబు ఈనెల 18న ఆర్టీజీఎస్ నుంచి టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని, విధ్వంసమైన రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నామని, అందరి సహకారం వల్లే బెస్ట్ రిఫార్మర్ ఆఫ్ ద ఇయర్ అవార్డు దక్కిందన్నారు. ప్రభుత్వ యంత్రాంగంలో ఉన్న ప్రతీ ఒక్కరి సహకారం వల్లే వ్యవస్థలు గాడిలో పడ్డాయని, 2047 స్వర్ణాంధ్ర సాధనకు లక్ష్యాలు పెట్టుకున్న విషయాన్ని గుర్తు చేశారు.

త్వరలో బీపీసీఎల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన

అలాగే పది సూత్రాలను అమలు చేస్తున్నామని, 23 నెలల్లో 23 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని చెప్పారు. 24 లక్షల ఉద్యోగాలకు అవకాశాలు వచ్చాయని, గూగుల్, ఆర్సెల్లార్ మిట్టల్ వంటి కీలక ప్రాజెక్టులు వచ్చాయని, త్వరలో బీపీసీఎల్ వంటి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసుకుంటామని సీఎం వివరించారు. కిందిస్థాయి ఉద్యోగులు సీఎంతో నేరుగా మాట్లాడినందుకు సంతోషం వ్యక్తం చేశారు.

పోలవరం సహా సాగునీటి ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

పోలవరం సహా రాష్ట్రంలోని ఇతర సాగునీటి ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు నాయుడు ఈనెల 18న సమీక్ష నిర్వహించారు. ఇటీవల విడుదల చేసిన ఇరిగేషన్ క్యాలెండర్ కు తగ్గట్లుగా నిర్దేశిత గడువుకు ప్రాజెక్టులు పూర్తి కావాలని దిశానిర్దేశం చేశారు. వాటర్ మేనేజ్మెంట్ లో సాగునీటి సంఘాలతో పాటు ప్రజల భాగస్వామ్యం కూడా తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని సూచించారు. భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికల్ని రెడీ చేయాలని ఆదేశించారు.

ఈవీ వాహనాల వినియోగానికి సీఎం ఫోకస్

ఇంధన పొదుపు కోసం చేపట్టే కార్యాచరణలో భాగంగా ఎలక్ట్రిక్ వాహనాల వాడకాన్ని పెంచేలా ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్ లో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఉద్యమంగా మార్చేలా ప్రణాళికలు చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఈవీ సైకిళ్లు, ఈవీ వాహనాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర సెక్రటేరియట్ నుంచి ఈవీ కంపెనీల ప్రతినిధులతో వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఈనెల 18న మాట్లాడారు. రాష్ట్రంలో స్వర్ణ గ్రామ,స్వర్ణ వార్డు కార్యాలయాలకు ఎలక్ట్రిక్ సైకిళ్లు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. మొత్తం 16 వేల ఎలక్ట్రిక్ సైకిళ్లను ఆ కార్యాలయాల సిబ్బందికి అందించాలని సీఎం నిర్దేశించారు.

ఏడాదికి 9 లక్షల బుల్లెట్ బైక్‌ల ఉత్పత్తి లక్ష్యం

ఈనెల 18న రాయల్ ఎన్ ఫీల్డ్ సంస్థ సీఈఓ గోవింద రాజన్ సచివాలయంలో సీఎం చంద్రబాబును కలిశారు. తిరుపతి జిల్లా సత్యవేడు మండలం రాళ్లకుప్పం, వానల్లూరు గ్రామాల వద్ద 2500 కోట్ల రూపాయల పెట్టుబడితో రాయల్ ఎన్ ఫీల్డ్ బుల్లెట్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. అత్యాధునిక తయారీ యూనిట్‌తో పాటు టెస్టింగ్ ట్రాక్, పరిశోధనా కేంద్రం, వెండార్ పార్క్ ఎకోసిస్టమ్ కూడా నిర్మిస్తారు. ఈ ప్లాంట్ ద్వారా ఏడాదికి 9 లక్షల బుల్లెట్ మోటార్ సైకిళ్లు ఉత్పత్తి చేయనున్నారు. ఈ యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 15 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ప్రాజెక్టును బుల్లెట్ వేగంతో ముందుకు తీసుకువెళ్లి, 18 నెలల్లో నిర్మాణం పూర్తి చేసి బుల్లెట్ మోటార్ సైకిల్ ఉత్పత్తి ప్రారంభించాలని ఈ సందర్భంగా సీఎం కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక చర్యలు

రాష్ట్రంలో తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు, వడ గాలుల నుంచి రక్షణ పొందేందుకు సన్నద్ధత చర్యలపై CM చంద్రబాబు ఈనెల 22న సమీక్ష నిర్వహించారు. హీట్ వేవ్ పరిస్థితిని ఎదుర్కొనేలా ఎక్కడికక్కడ టెంట్లు, చలివేంద్రాలు, చల్లని నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ఇచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. తీవ్రస్థాయి ఉష్ణోగ్రతలు ఉన్న ప్రాంతాల్లో రిలీఫ్ మెజర్స్ చేపట్టాలని దిశానిర్దేశం చేశారు.

సీఎం చంద్రబాబు డెడ్‌లైన్

కంపెనీలతో ప్రభుత్వం కుదుర్చుకున్న ఒప్పందాలను ముందుకు తీసుకెళ్లేందుకు ఏపీ సర్కార్ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. రాష్ట్రంలో ఆమోదం పొందిన ప్రాజెక్టులను ఈ ఏడాది సెప్టెంబరులోగా గ్రౌండింగ్ చేయాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. 2028 డిసెంబర్ నాటికి ఆయా సంస్థలు ఆఫీసులను ప్రారంభించాల్సిందేనని క్లారిటీ ఇచ్చారు. విశాఖ భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలు, ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టులపై మంత్రుల కమిటీతో సీఎం ఈనెల 21న సమీక్షించారు. ఎంవోయూల స్టేటస్ పై ఆరా తీశారు. ఈ ఒప్పందాలపై మంత్రి లోకేశ్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మంత్రుల కమిటీ తీసుకున్న చర్యలను సీఎంకు వివరించారు. ఎస్ఐపీబీ ద్వారా ఇప్పటికి 11.47 లక్షల కోట్ల పెట్టుబడులతో 282 ప్రాజెక్టులకు ఆమోదం తెలిపామని చంద్రబాబు గుర్తుచేశారు. వీటిలో 114 ప్రాజెక్టులు గ్రౌండ్ అయినట్టు సీఎంకు మంత్రుల కమిటీ ఛైర్మన్ లోకేశ్ వివరించారు.

తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం

ఈ-కబురు, హైదరాబాద్: వెనుకబడిన తరగతుల్లోని కొన్ని కులాల పేర్లు ఇబ్బందికరంగా ఉన్న అంశాన్ని పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వం ఆ కులాల పేర్ల మార్పునకు ఆమోదం తెలిపింది. ఈ మేరకు బీసీ సంక్షేమ శాఖ ముఖ్యకార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర బీసీ కమిషన్ సిఫారసు మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.బీసీ కులాల్లో గ్రూప్–ఏ లోని వరుస సంఖ్య 4లో ఉన్న బుడబుక్కల కులాన్ని శివ క్షత్రియగా మార్పు చేశారు. ఇదే కేటగిరీలోని వన్నార్‌ను తొలగించి ధోబీగా మార్పు చేసి రజక, చాకలి, ధోబీగా.. ఏదైనా ఒక పేరును వాడుకలోకి తీసుకోవచ్చన్నారు. వరుస సంఖ్య 7లోని దొమ్మర అనే పదాన్ని తొలగించి గడ వంశీయగా మార్పు చేశారు.వరుస సంఖ్య 18లో ఉన్న పిచ్చకుంట్ల పేరును వంశరాజ్‌గా మార్పు చేశారు. వరుస సంఖ్య 23లో ఉన్న వీరభద్రియను వీరముష్టి, నెట్టి కోటల, వీరభద్రియగా మార్చారు. గ్రూప్ డీ, వరుస సంఖ్య 5లో ఉన్న మేర కులం పేరును మేరుగా మార్పు చేశారు. వరుస సంఖ్య 29లో ఉన్న శూద్ర కులం పేరును తొలగించి తమ్మలిగా మార్చారు.

సీఎంతో తమిళనాడు

మంత్రి విశ్వనాథన్ భేటీ

ఈకబురు, హైదరాబాద్: ఇటీవల తమిళనాడులో మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కాంగ్రెస్ ఎమ్మెల్యే విశ్వనాథన్.. ఆదివారం హైదరాబాద్ జూబ్లీ హిల్స్‌లోని సీఎం నివాసానికి వచ్చి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా సైతం విశ్వనాథన్ పనిచేస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయన మంత్రిగా నియమితులైన తరవాత తొలిసారి హైదరాబాద్‌కు వచ్చి సీఎంతో పాటు మంత్రులు పొంగులేటి, సీతక్క, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌తో భేటీ అయ్యారు. విశ్వనాథన్‌కు మంత్రి పదవి దక్కడంతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు, నేతలు ఆయనకు అభినందనలు తెలిపారు.

మక్కల కొనుగోళ్లకు మాది 'గ్యారంటీ'!

ఈకబురు,హైదరాబాద్: రాష్ట్రంలో మార్కెట్‌కు తరలివస్తున్న మక్కల కొనుగోళ్లకు అవసరమైన రుణాలు సమకూర్చుకునేందుకు మార్క్‌ఫెడ్‌కు రూ.1867.77 కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇస్తూ రాష్ట్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. యాసంగి సీజన్ మక్కల కొనుగోళ్లకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న మార్క్‌ఫెడ్‌కు ఇప్పటికే ప్రభుత్వం రూ.4,172.94 కోట్ల బ్యాంకు గ్యారంటీ ఇచ్చింది. దీంతో మక్కల కొనుగోళ్ల కోసం మార్క్‌ఫెడ్‌కు రూ.6,040.71 కోట్ల రుణాలు పొందేందుకు ప్రభుత్వం సహకారం అందించినట్టయ్యింది.

మక్కలకు క్వింటాల్‌కు మద్దతు ధర రూ.2,400 ఉండగా, మార్కెట్‌లో రూ.1,700 నుంచి రూ.1,850 గిట్టుబాటు ధర పలుకుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే కనీస మద్దతు ధర కింద రైతుల నుంచి కొనుగోలు చేస్తోంది. ఇప్పటి వరకు 354 కొనుగోలు కేంద్రాల (పీఏసీఎస్‌లు) ద్వారా 2.33 లక్షల రైతుల నుంచి 12.85 లక్షల మెట్రిక్ టన్నుల మక్కలను మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు కొనుగోలు చేసిన మక్కల విలువ రూ. 3,100 కోట్ల వరకు ఉంటుంది. అయితే మార్కెట్‌కు భారీ ఎత్తున మక్కలు వస్తుండడంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు మార్క్‌ఫెడ్‌కు అదనపు రుణం పొందేందుకు అవసరమైన బ్యాంకు గ్యారంటీని ప్రభుత్వం సమకూర్చింది.

కేంద్రం సహకరించకపోయినా రైతులకు అండగా : మంత్రి తుమ్మల

రాష్ట్రంలోని రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని మొక్కజొన్న, జొన్న, పొద్దు తిరుగుడు పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కొనుగోళ్లపై ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడంతో రైతులు నష్టపోకుండా రాష్ట్ర ప్రభుత్వమే ముందుకొచ్చి భారీ స్థాయిలో కొనుగోళ్లు చేపట్టేందుకు సీఎం ఆమోదం తెలిపారన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో మొక్కజొన్న కొనుగోళ్లకు మొత్తం రూ.5,063 కోట్ల మేర మాత్రమే ఖర్చు చేయగా, కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ ఒక్క యాసంగి సీజన్‌లోనే దాదాపు రూ.6,000 కోట్ల మేర వ్యయం చేస్తోందని తుమ్మల స్పష్టం చేశారు.జొన్నల కొనుగోళ్లకు రూ.1,100 కోట్లు

జొన్న (హైబ్రిడ్) కొనుగోళ్ల విషయంలో కూడా రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రస్తుతం మార్కెట్‌లో జొన్న ధర క్వింటాల్‌కు సుమారు రూ.2,000 మాత్రమే ఉండగా, కేంద్రం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ.3,699గా ఉందన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు రూ.1,100 కోట్లకు పైగా వ్యయంతో జొన్న కొనుగోళ్లు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. జిల్లాల వారీగా జొన్న కొనుగోళ్ల ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

ఆదిలాబాద్ జిల్లాలో 26 కేంద్రాలు, సంగారెడ్డి జిల్లాలో 10 కేంద్రాలు, కామారెడ్డి జిల్లాలో 43 కేంద్రాలు, మెదక్, వికారాబాద్ జిల్లాల్లో ఒక్కో కేంద్రం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జోగులాంబ గద్వాల, కుమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో కూడా కొనుగోళ్ల ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు.

పొద్దు తిరుగుడు 25 % కొనుగోళ్ల పరిమితి తొలగింపు

పొద్దుతిరుగుడు పంట విషయంలో కేంద్ర ప్రభుత్వం కేవలం 25 శాతం కొనుగోలు పరిమితి మాత్రమే అనుమతించిందని, అయితే రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని ఆ పరిమితికి మించి కొనుగోళ్లు చేపట్టాలని నిర్ణయించిందని మంత్రి తుమ్మల తెలిపారు. ప్రస్తుతం పొద్దుతిరుగుడు మద్దతు ధర క్వింటాల్‌కు రూ.7,721 ఉండగా, మార్కెట్ ధర రూ.5,376 మాత్రమే ఉండటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో కేంద్రానికి పంపిన ప్రతిపాదనలతోపాటు రాష్ట్ర పూల్ ద్వారా అదనంగా 10,175 మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని తెలిపారు.

గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకోవాలి

ఈకబురు,హైదరాబాద్: గోదావరి బేసిన్ పరిధిలోని ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వ వైఖరి ప్రదర్శిస్తోందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. ఇప్పటికైనా జలాలను సమర్థంగా వినియోగించేలా కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని సూచించారు. ఈ మేరకు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. "రాష్ట్రానికి సుమారు 968 టీఎంసీల నికర గోదావరి జలాలపై హక్కు ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో ఎక్కువ కాలం కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, తెలంగాణ ప్రాంతంలో గోదావరి జలాల వినియోగం కేవలం 400 టీఎంసీలకే పరిమితమైంది. 2014లో రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని గోదావరి నదిపై సుమారు 360 టీఎంసీల సామర్థ్యం గల ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసింది. గత భారాస ప్రభుత్వ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల లోపభూయిష్టమైన డిజైన్, నాణ్యత లేని నిర్మాణం కారణంగా 2023లో అవి తీవ్రంగా దెబ్బతిన్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎన్డీఎస్ఏ పలు సిఫార్సులు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో తగిన నిబద్ధత ప్రదర్శించలేదు. ఫలితంగా ఈ మూడు బ్యారేజీలు ఇప్పటికీ పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. ఈ ఆలస్యం కారణంగా రాష్ట్ర ప్రజలు దాదాపు 200 టీఎంసీల గోదావరి జలాలను ఉపయోగించుకోలేకపోతున్నారు. ట్రైబ్యునల్ ద్వారా రాష్ట్రానికి కేటాయించిన 968 టీఎంసీల నికర గోదావరి జలాలను సక్రమంగా వినియోగించుకునేలా చూడాలి. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ ముఖ్యమైన సమస్యపై అత్యవసరంగా

ఆర్థిక రంగంలో అత్యధిక లాభం ఎల్ఐసీదే

జనవరి-మార్చి త్రైమాసికంలో రూ.23,400 కోట్లు

దేశీయ ఆర్థిక రంగంలో అత్యధిక లాభాన్ని నమోదు చేసిన సంస్థగా ప్రభుత్వ రంగ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) నిలిచింది. గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (జనవరిమార్చి)లో ఎల్ఐసీ రూ.23,400 కోట్లకు పైగా నికర లాభాన్ని ప్రకటించింది. తదుపరి స్థానంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) నిలిచింది. జనవరిమార్చి త్రైమాసికంలో ఎస్‌బీఐ రూ.19,684 కోట్ల నికర లాభం ప్రకటించింది. దీని తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.19,221 కోట్ల నికర లాభంతో మూడో స్థానంలో ఉంది. 202526 పూర్తి ఆర్థిక సంవత్సరానికి ఎస్‌బీఐ రూ.80,032 కోట్ల నికర లాభం ఆర్జించి అగ్ర స్థానంలో ఉంది. దీని తర్వాత హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.74,760 కోట్ల నికర లాభంతో రెండో స్థానం దక్కించుకుంది. ఎల్ఐసీ రూ.57,419 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఐసీఐసీఐ బ్యాంక్ రూ.50,147 కోట్లు ఆర్జించింది.ప్రభుత్వ రంగ సంస్థ (పీఎస్‌యూ)ల్లో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) జనవరిమార్చి త్రైమాసికంలో రూ.11,378 కోట్ల నికర లాభంతో తొలిస్థానంలో ఉంది. కోల్ ఇండియా రూ.10,839 కోట్లు, పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) రూ.8,598 కోట్లు, ఎన్‌టీపీసీ రూ.8,747 కోట్ల నికర లాభంతో తరవాత స్థానాల్లో ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో (సీపీఎస్‌ఈలు) పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) రూ.4,546 కోట్లు, రూరల్ ఎలక్ట్రిఫికేషన్ (ఆర్‌ఈసీ) రూ.3,375 కోట్లు, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా (సెయిల్) రూ.1,680 కోట్లు నికర లాభాలతో తొలి 3 స్థానాల్లో ఉన్నాయి.మొత్తం కార్పొరేట్ రంగంలో వొడాఫోన్ ఐడియా అత్యధిక నికర లాభాన్ని నమోదు చేసిన సంస్థగా నిలిచింది. 2025 26 జనవరిమార్చి త్రైమాసికంలో రికార్డు స్థాయిలో రూ.51,970 కోట్ల నికర లాభాన్ని సంస్థ ప్రకటించింది. సర్దుబాటు చేసిన స్థూల ఆదాయాల (ఏజీఆర్) బకాయిల విషయంలో ప్రభుత్వం ఊరటనివ్వడంతో వొడాఫోన్ ఐడియా ఆరేళ్ల తర్వాత నికర లాభాన్ని ఆర్జించింది.

హైదరాబాద్‌లో ఐసీఏఐ అధునాతన ఫోరెన్సిక్ ల్యాబ్

3 నెలల్లోపే ప్రారంభం ; ప్రసన్న కుమార్

చిన్న, మధ్య స్థాయి ప్రాక్టీషనర్లకు తోడ్పాటు అందించేందుకు హైదరాబాద్‌లో అధునాతన ఫోరెన్సిక్ ఆడిటింగ్ ల్యాబ్ ఏర్పాటు చేయనున్నట్లు ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) అధ్యక్షుడు డి.ప్రసన్న కుమార్ తెలిపారు. ప్రస్తుతం ఐసీఏఐలో చిన్న, మధ్య స్థాయి ప్రాక్టీషనర్లతో కలిపి మొత్తం 5 లక్షల కంటే ఎక్కువ మంది సభ్యులు ఉన్నారు. ఫోరెన్సిక్ ఆడిట్ సరికొత్త రంగం కాగా.. చిన్న, మధ్య స్థాయి చార్టర్డ్ అకౌంటెంట్ సంస్థల వద్ద సరైన ఫోరెన్సిక్ ఆడిట్ నైపుణ్యాలు, సాంకేతికత లేకపోవడం వల్ల వారు పెద్ద ఆడిటింగ్ కాంట్రాక్టుల్లో పాల్గొనలేకపోతున్నారని ప్రసన్న కుమార్ వెల్లడించారు. ఈ సమస్యను పరిష్కరించడానికి ఐసీఏఐ హైదరాబాద్‌లోని తన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌లో ఈ అధునాతన ఫోరెన్సిక్ ల్యాబ్ ఏర్పాటు చేయనుంది. ఇది పే అండ్ యూజ్ (అసైన్‌మెంట్‌ను బట్టి రుసుము చెల్లించి వాడుకునే) మోడల్‌లో అందుబాటులో ఉంటుంది. సీఏలకు ప్రాజెక్టులకు అవసరమైన ప్రత్యేక ఆడిటింగ్ టూల్స్‌ను ఇది అందిస్తుంది. రాబోయే 23 నెలల్లో దీన్ని ప్రారంభించనున్నారు.

స్వదేశీ అకౌంటింగ్ సంస్థల ఏర్పాటులో....దేశంలో వేగంగా పెరుగుతున్న ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా, అంతర్జాతీయ దిగ్గజ సంస్థలతో పోటీపడేందుకు పెద్ద స్వదేశీ అకౌంటింగ్ సంస్థలను తయారు చేసేందుకు ప్రభుత్వం, ఐసీఏఐ కృషి చేస్తున్నాయి. ఇందులో భాగంగానే గత ఫిబ్రవరిలో గ్లోబల్ నెట్‌వర్కింగ్ గైడ్‌లైన్స్‌ను ఐసీఏఐ నోటిఫై చేసింది. దీని వల్ల దేశీయ సీఏ సంస్థలు అంతర్జాతీయ నెట్వర్క్‌లతో కలిసి పనిచేస్తూ పెద్ద సంస్థలుగా ఎదగడానికి మార్గం సుగమమవుతుంది.

సీఏ సిలబస్‌లో మార్పులు....మారుతున్న సాంకేతికత, వృత్తిపరమైన అవసరాలకు అనుగుణంగా సీఏ పాఠ్యప్రణాళికలో కృత్రిమ మేధ (ఏఐ), డేటా అనలిటిక్స్, ఇతర కొత్త సబ్జెక్టులను చేర్చడానికి ఐసీఏఐ సన్నద్ధమవుతోంది. ఇందుకోసం కమిటీ ఫర్ రివ్యూ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (సీఆర్ఈటీ)ను ఐసీఏఐ ఏర్పాటు చేసింది. రాబోయే నెలల్లో సిలబస్ అప్‌డేట్‌స్‌తో కూడిన తుది సిఫారసులను ఈ కమిటీ సమర్పించనుంది.

మార్కెట్ ఒడుదొడుకులకు శాంతి

పశ్చిమాసియా పరిణామాలు, కార్పొరేట్ ఫలితాలు కీలకం

ఎఫ్ఎమ్‌సీజీకి ఒత్తిడి

టెలికాం, ఐటీ, సిమెంటు షేర్లకు సానుకూలతలు

విశ్లేషకుల అంచనాలు

యుద్ధం ముగించే విషయమై అమెరికా ఇరాన్ మధ్య శాంతిచర్చలు కొలిక్కి వస్తున్నాయనే వార్తలు, చమురు ధరల ఆధారంగా ఈ వారం స్టాక్ మార్కెట్ చలించొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. యుద్ధానికి ముగింపు పలికే దిశగా ఇరు వర్గాలు చర్యలు తీసుకోవడం ఉపశమనం కలిగించేదే. హర్మూజ్ జలసంధిని 60 రోజుల పాటు తెరుస్తామని ఇరాన్ ప్రకటించడం గట్టిగా ప్రభావం చూపనుంది. కార్పొరేట్ సంస్థల మార్చి త్రైమాసిక ఫలితాలనూ గమనించాలి. విదేశీ మదుపర్ల ధోరణి, రూపాయి కదలికలూ ప్రభావం చూపుతాయి. నిఫ్టీ50కి 24,00024,100 వద్ద నిరోధం, 23,50023,220 వద్ద మద్దతు లభించొచ్చని సాంకేతిక నిపుణులు చెబుతున్నారు. జూన్, ఆగస్టు సమీక్షల్లో ఆర్‌బీఐ కీలక వడ్డీ రేట్లను పెంచొచ్చన్న అంతర్జాతీయ ఆర్థిక సంస్థల అంచనా వేస్తున్నా, రూపాయి మారకపు విలువ దృష్ట్యా సవరించకపోవచ్చని దేశీయంగా భావిస్తున్నారు. బక్రీద్ సందర్భంగా గురువారం మార్కెట్లకు సెలవు కావడంతో, ఈవారం నాలుగు రోజులే ట్రేడింగ్ జరగనుంది. వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలిలా..

మార్జిన్లు పెరుగుతుండడం, గిరాకీ కొనసాగుతున్నందున ప్రామాణిక సూచీలకు మిన్నగా లోహ సూచీ రాణించొచ్చు. లోహ ధరలు అధికంగా కొనసాగడం కంపెనీలకు కలిసిరావొచ్చు. అయితే కోకింగ్ కోల్ ధరల పెరుగుదలను గమనించాలి.ఇటీవలి భారీ నష్టాల తర్వాత ఐటీ షేర్లు కొంత మేర లాభాలు పొందొచ్చు. ఐటీ సూచీకి 28,00028,200 వద్ద మద్దతు, 29,70030,000 వద్ద నిరోధం కనిపిస్తున్నాయి. ప్రభుత్వానికి ఆర్‌బీఐ రూ.2.87 లక్షల కోట్ల డివిడెండ్ చెల్లించనుండటం, దేశ ఆర్థికానికి ఊతం ఇవ్వనుంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల ఉపశమనం నిఫ్టీ బ్యాంక్ సూచీకి మద్దతు నివ్వొచ్చు. పెన్షన్ ఫండ్ ఏర్పాటు కోసం పీఎఫ్ఆర్‌డీఏఐతో చర్చల్లో ఉన్నందున కెనరా బ్యాంక్ షేర్లు వెలుగులోకి రావొచ్చు. అధిక విలువల కారణంగా యంత్రపరికరాల షేర్లు ఒక శ్రేణిలో కదలాడొచ్చు. బలమైన భవిష్యత్తువృద్ధి అంచనాల కారణంగా ఈ షేర్ల వైపు మదుపర్లు మొగ్గుచూపొచ్చు. నిఫ్టీ వాహన సూచీకి బేరిష్ సంకేతాలున్నాయి. స్వల్పకాల, మధ్య కాల చలన సగటు మధ్య ఈ సూచీ కదలాడుతోంది. 25,700 వద్ద కీలక మద్దతు కనిపిస్తోంది. బజాజ్ ఆటో షేర్లు పెరగొచ్చని సాంకేతిక ఛార్టులు చెబుతున్నాయి. టెలికాం షేర్లపై విశ్లేషకులు సానుకూలంగా ఉన్నారు. భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా ఆర్థిక ఫలితాలు అంచనాలకు తగ్గట్లుగా వెలువడడం ఇందుకు నేపథ్యం. జులైఆగస్టులో టారిఫ్ పెంపు ఉంటే, ఈ షేర్లకు సానుకూలతలు పెరగొచ్చు. పశ్చిమాసియా పరిణామాల వల్ల పడుతున్న భారం ప్రభావం ఎఫ్ఎమ్‌సీజీ షేర్లపై కనిపించొచ్చు. కొంత లాభాల స్వీకరణా జరగొచ్చు. అమెరికాఇరాన్ చర్చల్లో పురోగతి వల్ల నిఫ్టీ చమురుగ్యాస్ సూచీ రాణించొచ్చు. పెట్రో ధరలను శనివారం మరోసారి పెంచడం మార్కెటింగ్ సంస్థలకు కలిసిరావొచ్చు. సిమెంటు షేర్లు రాణించొచ్చు. దీర్ఘకాల గిరాకీ వల్ల 202627లో 78% విక్రయాల వృద్ధి అంచనా ఉంది. అంబుజా, అల్ట్రాటెక్‌ను పరిశీలించొచ్చని ఓ బ్రోకరేజీ చెబుతోంది. నిఫ్టీ ఫార్మా సూచీ లాభాలు కొనసాగొచ్చు. అధిక కంపెనీలు అంచనాలకు అనుగుణంగా మార్చి త్రైమాసిక గణాంకాలు వెలువరచడమే కారణం. ఈ రంగ సూచీ 23,800 స్థాయికి పడితే, కొనుగోలుకు కొత్త అవకాశంగా భావించాలి.

విదేశీ ప్రయాణ వ్యయాలు తగ్గాయ్

మార్చిలో 1.09 బి.డాలర్లకు పరిమితం

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

భారతీయుల విదేశీ ప్రయాణ వ్యయాలు (విహార యాత్రలతో కలిసి) 1.09 బిలియన్ డాలర్ల (సుమారు రూ.10,400 కోట్ల)కు పరిమితమయ్యాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వెల్లడించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో విదేశీ ప్రయాణాల వ్యయాలు 1.3 బి.డాలర్లు కాగా, మార్చిలో 212.43 మిలియన్ డాలర్లు (రూ.2,000 కోట్లు) తగ్గినట్లయ్యింది. జనవరిలో ఈ వ్యయాలు 1.65 బి.డాలర్లుగా నమోదయ్యాయి. 'నివాస వ్యక్తుల కోసం సరళీకృత చెల్లింపుల పథకం (ఎల్ఆర్ఎస్) కింద విదేశాలకు పంపే చెల్లింపుల' వివరాలనూ ఆర్‌బీఐ తెలిపింది. ప్రయాణాలు, దగ్గరి బంధువుల పోషణ, విదేశాల్లో చదువులు, ఈక్విటీ, డెట్‌లో పెట్టుబడుల కోసం విదేశాల్లో మనవారు ఖర్చు చేసినట్లు తెలుస్తోంది. ఎల్ఆర్ఎస్ కింద, మైనర్లతో పాటు నివాసితులైన వ్యక్తులు, ఏదైనా అనుమతించిన కరెంట్ లేదా క్యాపిటల్ ఖాతా లావాదేవీ కోసం లేదా రెండింటికి కలిపి ప్రతి ఆర్థిక సంవత్సరంలో 2,50,000 డాలర్ల (సుమారు రూ.2.37 కోట్ల) వరకు పంపించుకోవచ్చు. 2026 మార్చిలో మొత్తం విదేశాలకు పంపిన డబ్బు విలువ 2.59 బి.డాలర్లుగా ఉంది. ఇందులో ప్రయాణానికి సంబంధించిన వాటా 1.09 బి.డాలర్లతో అతి పెద్దదిగా ఉంది.పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో, చమురు ధరలు పెరగడం, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ రికార్డు కనిష్ఠానికి పడిపోవడంతో.. ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలను విదేశీ ప్రయాణాలు తగ్గించుకోవాలని, రోజువారీ ప్రయాణాలకు కార్‌పూలింగ్ ఎంచుకోవాలని కోరారు. విదేశీ ప్రయాణాలు తగ్గితే, విదేశీ మారకపు ద్రవ్య వ్యయం తగ్గుతుంది. ఇంధనాన్ని పొదుపుగా వాడితే, దిగుమతులకు వెచ్చించాల్సిన డాలర్లు అదుపులోకి వస్తాయి. రూపాయి విలువ క్షీణతను అరికట్టేందుకు ఇది సహాయపడుతుంది.

వినియోగం చెంతనే సింగ్యాస్ ఉత్పత్తి

2 రకాలుగా ప్రాజెక్టులకు కోల్ ఇండియా సన్నాహాలు

పశ్చిమాసియా పరిణామాల్లో, అంతర్జాతీయంగా సహజవాయువు సరఫరాలో తీవ్ర అంతరాయాలు తలెత్తాయి. మన దేశానికీ గ్యాస్ దిగుమతులు రావడంలో అవరోధాలు ఏర్పడిన నేపథ్యంలో.. ప్రభుత్వ రంగ సంస్థ కోల్ ఇండియా సరికొత్త వ్యూహాలు సిద్ధం చేసింది. గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్‌లు, డైరెక్ట్ రెడ్యూస్డ్ ఐరన్ పరిశ్రమలు, ఎరువుల తయారీ యూనిట్లకు గ్యాస్ అవసరాలను తీర్చడానికి బొగ్గు గనుల వద్ద లేదా ఆయా పరిశ్రమల పక్కనే 'బొగ్గు నుంచి సింథటిక్ గ్యాస్ (సింగ్యాస్)' ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోల్ ఇండియా యోచిస్తోంది. జాతీయ బొగ్గు గ్యాసిఫికేషన్ మిషన్, రసాయనాల ఉత్పత్తి పెంచాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా కోల్ ఇండియా ఈ అడుగులు వేస్తోంది. ఈ కేంద్రాలను బిల్డ్‌ఓన్‌ఆపరేట్ (బీఓఓ)/ బిల్డ్‌ఆపరేట్ మెయింటైన్ (బీఓఎం) పద్ధతిలో డెవలపర్లు, కన్సార్షియంల ద్వారా అభివృద్ధి చేయడానికి కోల్ ఇండియా ఆసక్తి వ్యక్తీకరణ పత్రాలను ఆహ్వానించింది. దీని కోసం రెండు రకాల మోడళ్లను ప్రతిపాదించారు. మొదటి విధానంలో బొగ్గు గనుల సమీపంలో ఉన్న కోల్ ఇండియా స్థలంలోనే సింగ్యాస్ ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. ఇక్కడి నుంచి పైప్‌లైన్ నెట్‌వర్క్ ద్వారా సమీపంలోని పారిశ్రామిక క్లస్టర్‌లకు గ్యాస్ సరఫరా చేస్తారు. రెండో విధానంలో ఇప్పటికే ఉన్న ఏదైనా పెద్ద గ్యాస్ ఆధారిత విద్యుత్ ప్లాంట్, ఎరువుల ఫ్యాక్టరీ, స్టీల్ ప్లాంట్ పక్కనే నేరుగా సింగ్యాస్ కేంద్రాన్ని నిర్మిస్తారు. దీని వల్ల పైప్‌లైన్ రవాణా దూరం తగ్గి, సదరు పరిశ్రమకు ఎటువంటి అంతరాయం లేని స్థిరమైన గ్యాస్ లభిస్తుంది.

డెలివరీ ఖర్చులు 19% అధికమయ్యాయ్

ఇంధన ధరల వల్లే, ఆసియా పసిఫిక్‌పై ఫార్ఐ నివేదిక

భారత్ సహా ఆసియా పసిఫిక్ ప్రాంతంలో గతేడాది ఇదే కాలంతో పోలిస్తే, ఈ ఏడాది మార్చి-మే నెలల్లో డెలివరీ వ్యయాలు 19% పెరిగాయని లాజిస్టిక్స్ సాఫ్ట్‌వేర్ యాజ్ ఎ సర్వీస్ సంస్థ ఫార్ఐ తాజా నివేదికలో పేర్కొంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా ఇంధన సరఫరా, ధరలపై ఒత్తిడి పెరిగిన నేపథ్యంలో ఈ సర్వే నిర్వహించారు. 'ఆసియా పసిఫిక్‌లో డెలివరీ వ్యయాలు సగటున 19% పెరిగాయి. పెరిగిన ఇంధన ధరలు, డ్రైవర్ల వేతనాలు, పట్టణ ప్రాంతాల్లో విపరీతమైన ట్రాఫిక్ రద్దీ వల్ల భారత్‌లో ఈ పెరుగుదల ఆశ్చర్యకరమేమీ కాదు. డెలివరీ ఆపరేటర్లు ఖర్చులు ఎక్కడ అవుతున్నాయో చూడగలుగుతున్నారు. కానీ ఆ ఖర్చు అసలు ఎక్కడ మొదలవుతుందో గుర్తించలేకపోతున్నారు' అని నివేదిక పేర్కొంది. దేశంలోని పట్టణ ప్రాంతాల్లో మొదటి ప్రయత్నంలోనే డెలివరీ విఫలమయ్యే రేటు 20-30% వరకు ఉంటోంది. కంపెనీల లాభాలను దెబ్బతీసే ప్రధాన కారణాల్లో ఇది ఒకటి.గత మూడేళ్లలో 10 నిమిషాలు, 20 నిమిషాల్లో డెలివరీలు చేస్తున్న భారత క్విక్ కామర్స్ రంగం రూ.కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తోంది. అయితే 41% మంది కొనుగోలుదార్లు తమ డెలివరీ ఏ సమయానికి వస్తుందో ముందే కచ్చితంగా చెప్పే ప్రెడిక్టబుల్ డెలివరీ టైమ్ కోరుకుంటున్నారు.22% మంది మాత్రం సాధ్యమైనంత త్వరగా వచ్చే డెలివరీని ఇష్టపడుతున్నారు.దేశంలో నిర్దిష్టమైన సేవలకు అదనపు సొమ్ము చెల్లించడానికి కొనుగోలుదార్లు సిద్ధంగా ఉన్నారని మెజారిటీ డెలివరీ సర్వీస్ ప్రొవైడర్లు చెబుతున్నారు. సరైన సమయంలో అత్యవసరాల డెలివరీ కోసం అదనంగా చెల్లించడానికి సిద్ధంగా ఉన్నామని 60% మంది వెల్లడించారు. ప్రత్యేక డెలివరీల కోసం ప్రీమియం ఛార్జీలు చెల్లించడానికీ వెనకాడటం లేదని 70% సంస్థలు తెలిపాయి.

సిమెంట్‌కు మంచి రోజులే

2026-27పై కంపెనీల అంచనా

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ సిమెంటుకు గిరాకీ పెరుగుతుందనే కంపెనీలు ఆశిస్తున్నాయి. పశ్చిమాసియా పరిణామాల వల్ల ఇంధన అధిక ధరల వంటి ప్రతికూలతలున్నా.. మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ వ్యయాలు అధికంగా చేస్తుండటం, గృహ నిర్మాణ గిరాకీ, పట్టణీకరణ.. ఇందుకు కారణంగా పేర్కొంటున్నారు. 202627లో పరిశ్రమ 78% వృద్ధి సాధిస్తుందన్నది సిమెంటు తయారీదార్ల అంచనా. అల్ట్రాటెక్ సిమెంట్, అంబుజా సిమెంట్స్, శ్రీ సిమెంట్, దాల్మియా సిమెంట్, నువోకో విస్టాస్ వంటి కంపెనీల ఉన్నతాధికారులు.. తాజా ఎర్నింగ్స్ కాల్స్‌లో, మధ్యకాలిక డిమాండ్‌పై ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రీమియం ఉత్పత్తులపై మక్కువ పెరగడం వల్ల, మెరుగైన రాబడులు వస్తాయనే భావనతో.. కంపెనీలు మూలధన వ్యయ ప్రణాళికలనూ వేగవంతం చేస్తున్నాయి. అధిక ఇంధన ధరలు, రవాణా ఖర్చులు, దిగుమతులకు ఆటంకాల వల్ల సిమెంట్ రంగం స్వల్పకాలిక సవాళ్లను ఎదుర్కొంటోందని అల్ట్రాటెక్ సిమెంట్ ముఖ్య ఆర్థిక అధికారి (సీఎఫ్ఓ) అతుల్ దాగా వెల్లడించారు. పెట్రోల్, డీజిల్ ధర పెరగడాన్ని ప్రస్తావిస్తూ, సిమెంట్ కంపెనీల మొత్తం నిర్వహణ వ్యయాల్లో 5055% విద్యుత్, ఇంధన, అమ్మకపు ఖర్చులే ఉంటాయని వివరించారు. తమ కంపెనీ రెండంకెల వృద్ధి ఆశిస్తోందని పేర్కొన్నారు. 202627లో తమ ఏకీకృత విక్రయాల పరిమాణం సుమారు 8% పెరిగి, 80 మిలియన్ టన్నులకు చేరుకుంటుందని అంబుజా సిమెంట్స్ సీఈఓ వినోద్ బహేటే అంచనా వేశారు. పరిశ్రమ స్థాయిలో వృద్ధి 55.5 శాతంగా ఉండొచ్చని తెలిపారు. ద్రవ్యోల్బణం, బలహీన రుతుపవన అంచనాల వంటివి ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు.దాల్మియా భారత్ ఎండీ, సీఈఓ పునీత్ దాల్మియా, శ్రీ సిమెంట్ ఎండీ నీరజ్ అఖౌరీ, నువోకో విస్టాస్ ఎండీ జయకుమార్ కృష్ణస్వామి కూడా భౌగోళిక, రాజకీయ అనిశ్చితులు, పెరుగుతున్న ఇంధన ధరలు, కరెన్సీ ఒడుదొడుకులు, అధిక ముడి పదార్థాల వ్యయాలు ప్యాకింగ్ మెటీరియల్స్ వంటివి కంపెనీల మార్జిన్లపై ప్రభావం చూపుతాయని, 12 త్రైమాసికాలు ఒత్తిడి ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వ వ్యయాలు కొనసాగడంతో, సిమెంటు పరిశ్రమలో ఆశావాదం ఉందని వివరించారు.వచ్చే రెండేళ్లలో విస్తరణ కోసం నిర్మా గ్రూప్ సంస్థ నువోకో విస్టాస్ 202627లో రూ.900 కోట్లు, 202728లో రూ.960 కోట్లు పెట్టుబడులు పెట్టబోతున్నట్లు ప్రకటించింది. దాల్మియా భారత్ రూ.3,2003,400 కోట్ల పెట్టుబడులు పెట్టే ప్రణాళికలో ఉంది. ఆదిత్య బిర్లా గ్రూప్ సంస్థ అల్ట్రాటెక్ సిమెంట్ ప్రతి సంవత్సరం రూ.10,000 కోట్ల చొప్పున వచ్చే 45 ఏళ్లు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమైంది. అదానీ గ్రూప్ సంస్థ అంబుజా సిమెంట్స్ 202627లో రూ.6,0006,500 కోట్లు పెట్టుబడి పెట్టబోతోంది.

ఆయన కళ్లు అంటే నాకు ఇష్టం..

టాలీవుడ్‌కు చెందిన ఆ హీరో కళ్లు, ఆయన నటన అంటే నాకు చాలా ఇష్టం అంటుంది హీరోయిన్ అవికాగోర్. 'చిన్నారి పెళ్లి కూతురు' సీరియల్‌తో తెలుగు ప్రేక్షకులకు దగ్గరైన ఈ అమ్మడు.. 'ఉయ్యాల జంపాల' సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చింది. తర్వాత పలు సినిమాల్లో నటించి మెప్పించింది. ఇక తన పెళ్లి తర్వాత ప్రస్తుతం సెకండ్ ఇన్నింగ్స్ స్టార్ట్ చేసిన అవిక.. రీసెంట్‌గా 'అగ్లీస్టోరీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చి పర్వాలేదనిపించుకుంది. ఇక ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా.. 'మీ జీవితకాలంలో ఒకే హీరోతో కేవలం మూడు సినిమాలు చేసే అవకాశం వస్తే, మీరు ఎవరిని ఎంచుకుంటారు?' అని యాంకర్ ప్రశ్నించగా.. ఆలోచించుకోకుండా నేచురల్ స్టార్ నాని పేరు చెప్పింది ఈ బ్యూటీ. 'ఆయన కళ్ళు, ఆయన భావాలను వ్యక్తపరిచే విధానం, ప్రతీదానిలో ఎంతో డెప్త్ ఉంటుంది. ఆయన నటనలో ఎన్నో కోణాలు ఉన్నట్లు అనిపిస్తుంది. నాకు అలాంటి నటన అంటే చాలా ఇష్టం. ఆ హీరోతో సినిమా చేయడానికి అవకాశం వస్తే తప్పకుండా చేస్తాను' అని తెలిపింది.

మంచులో ప్రేమ

హాట్ హాట్ సమ్మర్‌లో కూల్ కూల్ ప్రదేశాలకు వెళితే ఆ హాయే వేరు. దుల్కర్ సల్మాన్, పూజా హెగ్డేకి ఆ చాన్స్ దక్కింది. ఈ ఇద్దరూ జంటగా రూపొందుతున్న తాజా చిత్రం షూటింగ్ ఓ చల్లని ప్రదేశంలో జరిగింది. మంచు, చిరు జల్లుల మధ్య ఈ చిత్రానికి సంబంధించిన కీలక షెడ్యూల్‌ని పూర్తి చేసింది యూనిట్. ఆ ఫొటోలను విడుదల చేశారు. చిరు జల్లుల నుంచి తప్పించుకోవడానికి గొడుగు, చలి తట్టుకోవడానికి వింటర్ అవుట్‌ఫిట్స్‌లో ప్రకృతిని ఆస్వాదిస్తూ కనిపించారు దుల్కర్, పూజ. అందమైన ప్రేమకథగా ఈ చిత్రాన్ని రవి నెలకుడితి దర్శకత్వంలో సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ షెడ్యూల్‌లో ప్రేమ నేపథ్యంలో సాగే సన్నివేశాలను చిత్రీకరించారు. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, కెమెరా: అనయ్ ఓం గోస్వామి.

'ఇరుముడి' కోసం విభిన్న గెటప్‌లో

కథానాయకుడు రవితేజ.. దర్శకుడు శివ నిర్వాణ కలయికలో రూపొందుతున్న చిత్రం 'ఇరుముడి'. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రియా భవానీ శంకర్ కథానాయిక. తండ్రీ కూతుళ్ల అనుబంధాలతో ముడిపడిన ఈ యాక్షన చిత్రంలో రవితేజ అయ్యప్ప స్వామి భక్తుడిగా కనిపించనున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడాయన పాత్రకి సంబంధించి మరో ఆసక్తికర వార్త వినిపిస్తోంది. దీంట్లో ఓ కీలక ఎపిసోడ్‌లో ఆయన మునుపెన్నడూ చేయని విభిన్నమైన గెటప్‌లో ఆశ్చర్యపరచనున్నట్లు సమాచారం. అది వయసు పైబడిన పాత్రగా ఉండే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇక ఈ సినిమా కోసం ఎంతో జనాదరణ పొందిన "విల్లాలి వీరుడు ఎక్కినాడు పల్లకి..." అనే భక్తి పాటను రీమేక్ చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా ఈ ఏడాది చివర్లో థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

సిద్ధాంతాల మధ్య చిక్కుకున్న మనిషి భావోద్వేగాల కథకు 'పామ్ డి ఓర్'

అట్టహాసంగా ముగిసిన 79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ ఫ్యాషన్ హంగులకే పరిమితం కాకుండా.. లోతైన భావోద్వేగాలతో కూడిన మానవీయ కథలను సినీప్రేమికులకు పరిచయం చేసే వేదికగా మారింది. ప్రపంచ నలుమూలల నుంచి సినీ, ఫ్యాషన్ రంగాలకు చెందిన ప్రముఖులు తమ దేశ సంస్కృతిని, వ్యక్తిగత అభిరుచిని చాటే ప్రత్యేక దుస్తులను ధరించి రెడ్‌కార్పెట్‌పై మెరిశారు. దర్శకులు.. భావోద్వేగాలతో నిండిన తమ చిత్రాల ప్రదర్శనలతో సినీ ప్రియుల దృష్టిని ఆకర్షించారు. కేన్స్ చిత్రోత్సవంలో ప్రతిష్ఠాత్మకంగా భావించే 'పామ్ డి ఓర్' పురస్కారం ఎవరిని వరిస్తుందా అని సినీ ప్రియులు ఎంతగానో ఎదురు చూసిన వేళ.. రొమే నియాకు చెందిన క్రిస్టియన్ ముంగియు దీనిని రెండోసారి గెలుచుకున్నారు. ఆయన దర్శకత్వం వహించిన 'ఫ్యోర్డ్' చిత్రానికిగానూ ఈ గౌరవం దక్కింది. ఆయన 2007లో '4 మంత్స్, 3 వీక్స్ అండ్ 2 డేస్' అనే చిత్రానికి తొలి 'పామ్ డి ఓర్' తొలి పురస్కారం గెలుచుకున్నారు. ఈ సందర్భంగా జ్యూరీ అధ్యక్షుడైన దక్షిణ కొరియా దర్శకుడు పార్క్ చాన్ వూక్ ఈ సినిమాని విభిన్న దృక్కోణాలతో.. కళాత్మకంగా అద్భుతమైనరీతిలో అర్థమయ్యేలా రూపొందించారని ప్రశంసించారు. కుటుంబం, మతం, పిల్లల పెంపకం, సమాజపు సిద్ధాంతాల మధ్య చిక్కుకున్న మనిషి భావోద్వేగాన్ని ఈ చిత్రం మనసుకి హత్తుకునేలా చూపించింది. ముంగియు మాట్లాడుతూ.. ''అవార్డులపై కాకుండా సినిమాపై దృష్టిని పెట్టడం ముఖ్యం. మనం ఇతరులను గౌరవించాలి. మానవాళిని వేధిస్తున్న ప్రశ్నలకు ప్రజలే తమ సమాధానాలు కనుక్కోవాలి. మన తర్వాత తరానికి ఇప్పుడున్న సమాజంలో కంటే తక్కువ హింసతో కూడిన సమాజాన్ని అందించాలి''అన్నారు.

'హల్లల్లల్లో' అంటూ అదరగొట్టిన సింగర్.. ఎవరీ రక్షితా సురేశ్?

హల్లల్లల్లో' (Hellallallo) అంటూ తన గమ్మత్తైన గాత్రంతో సంగీత ప్రియుల్ని ఉర్రూతలూగిస్తున్నారు గాయని రక్షితా సురేశ్ (Rakshitha Suresh). రామ్‌చరణ్ (Ram Charan) హీరోగా తెరకెక్కిన 'పెద్ది' (Peddi)లోని ప్రత్యేక గీతమిది. ఆదివారం ఉదయం విడుదలైన ఈ సాంగ్ సోషల్ మీడియాలో రీ సౌండ్ చేస్తోంది. మరి, రక్షిత ఇంతకు ముందు తెలుగులో ఏయే పాటలు పాడారో మీకు తెలుసా..?

బాల్యంలోనే సంగీతంపై ఆసక్తి కలిగిన రక్షిత.. కర్ణాటక సంగీతం, హిందూస్థానీ శాస్త్రీయ సంగీతంతో పాటు లైట్ మ్యూజిక్‌లో శిక్షణ పొందారు. కన్నడలో 'రిథమ్ తధీమ్', 'లిటిల్ స్టార్ సింగర్2009' టైటిల్ గెలిచిన ఆమె.. తమిళంలో 'సూపర్ సింగర్ 6' ఫస్ట్ రన్నరప్‌గా నిలిచారు.

తెలుగు పాటతో మొదలైన ప్రయాణం..

మైసూరు (కర్ణాటక)కు చెందిన రక్షిత సినీ ప్రయాణం తెలుగు పాటతోనే ప్రారంభమైంది. గాయనిగా ఆమెను ప్రముఖ సంగీత దర్శకుడు ఇళయరాజా చిత్ర పరిశ్రమకు పరిచయం చేయడం విశేషం. 'ఎవడే సుబ్రహ్మణ్యం' (2015)లోని 'చల్లగాలి తాకుతున్న మేఘమైనదీ మనసిలా' అనే గీతంతో తొలి ప్రయత్నంలోనే శ్రోతల హృదయాల్ని హత్తుకున్నారు రక్షిత. 'లవ్‌స్టోరీ'లోని ముత్యాల చెమ్మ చెక్క పాటతో తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించారు. పలు డబ్బింగ్ సినిమాల్లోని పాటలతోనూ తెలుగు ఆడియన్స్‌ను అలరించారు. 'జవాన్'లోని 'నాట్ రామయ్యా వస్తావయ్యా', 'ది లెజెండ్'లోని 'తొలి తొలి ఆశల ఊసులే' తెలుగు వెర్షన్లతో మెప్పించారు. హిప్‌హాప్ తమిళ, జీవీ ప్రకాశ్‌కుమార్, యువన్ శంకర్‌రాజా తదితర మ్యూజిక్ డైరెక్టర్లతోనూ ఆమె వర్క్ చేశారు.



ఏఆర్ రెహమాన్‌తోw 'ప్రత్యేకం'!

ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్‌తో ప్రత్యేక అనుబంధం ఉంది. ఎక్కువగా ఆయన సంగీత దర్శకత్వంలోనే పాటలు పాడారు. 'మిమీ'తో మొదలైందీ కాంబినేషన్. రెహమాన్ సంగీతం అందించిన 'లైఫ్ ఆఫ్ ముత్తు', 'కోబ్రా', 'పొన్నియిన్ సెల్వన్', 'పొన్నియిన్ సెల్వన్ 2', 'మామన్నన్', 'ఆడు జీవితం', 'థగ్‌లైఫ్' తదితర చిత్రాల్లో రక్షిత తన గాత్రంతో ఆకట్టుకున్నారు. రెహమాన్ కాన్సర్ట్‌ల్లోనూ ఆమె సందడి చేస్తుంటారు. ఉత్తరాంధ్ర యాసతో కూడిన 'హల్లల్లల్లో' పాట.. తనశైలికి పూర్తి భిన్నమైనా అదరగొట్టారు.

అది ఏమాత్రం మంచిది కాదు.. ఎడ్యుకేషన్ సిస్టమ్‌పై పూరి మ్యూజింగ్స్

మార్కులకే ప్రాధాన్యమిస్తూ విద్యార్థులను కాంపిటేషన్ మోడ్‌లో ఉంచడం ఏమాత్రం మంచిది కాదని ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ (Puri Jagannadh) పేర్కొన్నారు. పాఠశాల, కళాశాలల్లో సబ్జెక్టుల కన్నా ముందు జీవితం గురించి నేర్పాలని అభిప్రాయపడ్డారు. 'ఫ్యూచర్ ఎడ్యుకేషన్' (Future Education) పేరిట 'పూరి మ్యూజింగ్స్' (Puri Musings)లో విద్యావ్యవస్థపై మాట్లాడారు. ''నేటి మోడ్రన్ స్కూళ్లు పిల్లలకు అపారమైన జ్ఞానాన్ని అందిస్తున్నాయి. అయితే ఆ నాలెడ్జ్ విద్యార్థులను బలమైన వ్యక్తులుగా (మానసికంగా) తయారు చేసేందుకు ఉపయోగపడదు. ఇంటి పనులు ఎలా చేసుకోవాలన్నది ఎల్‌కేజీ నుంచే నేర్పాలి. శుభ్రత గురించి చెప్పాలి. ఐదేళ్లకే సమయపాలన, నిజాయతీ అంటే ఏంటో వివరించాలి. ప్రతి విద్యార్థికీ క్రమశిక్షణను నూరిపోయాలి. కుకింగ్ క్లాసెస్ కూడా ఉండాలి. వ్యాయామం, ఆటలు తప్పనిసరి చేయాలి. డిజిటల్ డిసిప్లిన్ గురించి చెప్పాలి.ఇప్పటి స్కూళ్లన్నీ పరీక్షలు, మార్కులు, కంఠస్తం చేయడంపై దృష్టి పెడుతున్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ కన్నా ముందు సెల్ఫ్ కంట్రోల్, టైమ్ మేనేజ్‌మెంట్, ఎమోషనల్ బ్యాలెన్స్ లాంటి వాటిపై పాఠాలుండాలి. ఇవే వారికి జీవితంలో ఉపయోగపడతాయి. వారానికోసారి విద్యార్థులతో మెడిటేషన్ చేయించాలి. వయసుపెరిగేకొద్దీ.. ఒత్తిడిని ఎలా అధిగమించాలి? కోపాన్ని ఎలా కంట్రోల్ చేయాలి? అన్నవి చెప్పాలి. కమ్యూనికేషన్ ప్రాధాన్యాన్ని వివరిస్తూ.. కనీసం మూడు భాషలు మాట్లాడేలా చూడాలి. మెంటల్ హెల్త్‌పై అవగాహన కలిగించేలా ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నిర్వహించాలి. అన్నింటికన్నా ముఖ్యంగా ప్రకృతిని ఎలా కాపాడుకోవాలన్నది చెప్పాలి. వీటి తర్వాతే మిగిలిన సబ్జెక్టులుండాలి. జీవితంలో కష్టం ఎదురైతే పాఠశాలలో చెప్పిన మోటివేషన్ క్లాస్ గుర్తురావాలి. అందుకే పిల్లల్ని మోటివేట్ చేసే టీచర్లు కావాలి. ఈరోజుల్లో ఏ డిగ్రీ అయినా అది బేసిక్ ఎడ్యుకేషన్ మాత్రమే. దానితో జీవితం మారిపోదు. దానికోసం చిన్నప్పటి నుంచీ పుస్తకాలను భుజాన మోయించాల్సిన అవసరం లేదు. మార్కుల కోసం వారిని కాంపిటిషన్ మోడ్‌లో పెట్టడం మంచిది కాదు. దీని వల్ల చిన్నప్పుడే ఆందోళనకు లోనవుతున్నారు. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో లెక్కల ప్రకారం.. మన దేశంలో ఏటా 13,000 నుంచి 15,000 మంది విద్యార్థులు సూసైడ్ చేసుకుంటున్నారు. అకడమిక్ ఒత్తిళ్లు, ఫెయిల్యూర్‌కి భయపడటం, కుటుంబం పెట్టుకున్న అంచనాలు, డిప్రెషన్‌లాంటివి ఇందుకు కారణం. ఇన్ని వేల మంది ఆత్మహత్య చేసుకుంటున్నారంటే వారి మానసిక పరిస్థితిని అర్థం చేసుకోండి.మన ఎడ్యుకేషన్ సిస్టమ్ మారాలి. పిల్లలు పర్సనల్‌గా స్ట్రాంగ్ కావాలి. పోలీసు అధికారులను స్కూళ్లు, కాలేజీలకు ఆహ్వానించి విద్యార్థులకు సివిక్ సెన్స్ నేర్పించాలి. చదువుకన్నా సంస్కారం ముఖ్యం. అందుకే సంస్కారం, మనోస్థైర్యం నేర్పే ఎడ్యుకేషన్ రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా'' అని అన్నారు.

నేటి నుంచే నార్వే చెస్

ఒస్లో: ప్రతిష్టాత్మక నార్వే చెస్ టోర్నీలో సత్తాచాటుకునేందుకు ప్రపంచ ఛాంపియన్ డి.గుకేశ్, యువ సంచలనం ప్రజ్ఞానంద సిద్ధమయ్యారు. సోమవారం ప్రారంభం కానున్న ఈ టోర్నీలో ప్రపంచ మాజీ నంబర్‌వన్ మాగ్నస్ కార్‌ల్‌సన్ (నార్వేకు గుకేశ్, ప్రజ్ఞానంద సవాళ్లు విసరనున్నారు. తొలిసారిగా ఈ టైటిల్ సాధించి భారత నిరీక్షణకు తెరదించాలని ఈ కుర్రాళ్లు పట్టుదలగా ఉన్నారు. ఓపెన్, మహిళల విభాగంలో ప్రపంచంలోని ఆరుగురు అత్యుత్తమ క్రీడాకారులు ఈ పోటీల్లో బరిలో దిగుతున్నారు. కార్‌ల్‌సన్, అలీరెజా ఫిరౌజా (ఫ్రాన్స్), విన్సెంట్ కీమెర్ (జర్మనీ), వెస్లీ సో (అమెరికా) వంటి దిగ్గజాలు బరిలో ఉండటంతో గుకేశ్, ప్రజ్ఞానందలకు పరీక్ష తప్పదు. మహిళల విభాగంలో భారత స్టార్ క్రీడాకారిణి కోనేరు హంపి, ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. అయిదు సార్లు ప్రపంచ ఛాంపియన్ జు వెన్‌జున్ (చైనా), డిఫెండింగ్ ఛాంపియన్ అనా ముజిచుక్ (ఉక్రెయిన్), బిబిసారా అసౌబయెవా (కజకిస్తాన్), జు జైనర్ (చైనా) పోటీలో ఉన్నారు. ఈ టోర్నీలో పది రౌండ్లు ఉంటాయి. ప్రతి ఒక్కరు మరొకరితో రెండు సార్లు (తెలుపు, నలుపు పావులు) పోటీపడతారు. క్లాసికల్ విజేతకు 3 పాయింట్లు లభిస్తాయి. గేమ్ డ్రాగా ముగిస్తే 'ఆర్మగెడాన్' టైబ్రేక్ నిర్వహిస్తారు. అందులో గెలిచిన వారికి 1.5 పాయింట్లు దక్కుతాయి.

తనయుడికి సచిన్ ప్రశంస

లఖ్‌నవూ: దిగ్గజ క్రికెటర్ సచిన్ తెందుల్కర్ తన కుమారుడు అర్జున్‌పై ప్రశంసలు కురిపించాడు. ఈ సీజన్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ చివరి లీగ్ మ్యాచ్ (పంజాబ్‌పై) లో ఎడమచేతి వాటం పేసర్ అర్జున్ ఆకట్టుకోవడంతో సచిన్ స్పందించాడు. ''బాగా ఆడావు అర్జున్. ఈ సీజన్ ఆసాంతం నువ్వు నడుచుకున్న తీరుకు గర్వపడుతున్నా. ఎల్లప్పుడూ నీ ప్రతిభపై నమ్మకంతో ఓపికగా ఉంటూ.. నిశ్శబ్దంగా కష్టపడ్డావు. చివరి మ్యాచ్ వరకు అవకాశం కోసం ఎదురుచూడాల్సి వచ్చినా సానుకూలంగా ఉన్నావు. నైపుణ్యంతో పాటు ఓపికను కూడా క్రికెట్ పరీక్షిస్తుంది. ఈ రెండు విషయాల్లోనూ నువ్వు మెరుగ్గా కనిపించావు. ఒదిగి ఉండు. ఎప్పట్లాగే ఆటను ప్రేమించు. నిన్ను ఎల్లప్పుడూ ప్రేమిస్తూనే ఉంటా'' అని సచిన్ సామాజిక మాధ్యమం వేదికగా తన భావోద్వేగాన్ని పంచుకున్నాడు. శనివారం పంజాబ్‌తో మ్యాచ్ లఖ్‌నవూ తరపున అర్జున్‌కు అరంగేట్ర మ్యాచ్.

బరిలో 22 మంది భారత షూటర్లు

ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్

దిల్లీ: ఐఎస్ఎస్ఎఫ్ షూటింగ్ ప్రపంచకప్‌పై భారత షూటర్లు గురిపెట్టారు. ఈ టోర్నీలో తలపడబోయే 22 మంది షూటర్లతో కూడిన జట్టును భారత జాతీయ రైఫిల్ సంఘం (ఎఆర్ఏఐ) ఆదివారం ప్రకటించింది. మే 26 నుంచి ప్రారంభం కానున్న టోర్నీలో రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత మను బాకర్ రెండు వ్యక్తిగత పోటీలతో పాటు మిక్స్‌డ్ ఈవెంట్‌లోనూ పోటీపడనుంది. ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పతకం గెలిచిన ఇషా సింగ్ కూడా సత్తాచాటాలని చూస్తోంది. టోర్నీ తొలి రోజు పురుషుల 10 మీటర్ల విభాగంలో పిస్టల్, రైఫిల్ ఫైనల్స్ జరగనున్నాయి. మొత్తం 80 దేశాల నుంచి 696 షూటర్లు ప్రపంచకప్‌లో పోటీపడనున్నారు. ఏప్రిల్‌లో గ్రానడాలో జరిగిన షూటింగ్ ప్రపంచకప్‌లో స్వర్ణం గెలిచిన భారత్.. టాప్ ర్యాంకర్లు బరిలో ఉన్న ఈ ఈవెంట్లో ఎలాంటి ప్రదర్శన చేస్తుందో మరి.

జ్వెరెవ్ శుభారంభం

ఆంద్రీవా, బెన్సిచ్ ముందంజ

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్లో అలెగ్జాండర్ జ్వెరెవ్ శుభారంభం చేశాడు. ఈ జర్మనీ స్టార్ అలవోకగా తొలి రౌండ్‌ను అధిగమించాడు. ఆదివారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో రెండో సీడ్ జ్వెరెవ్ 63, 64, 62తో బోంజి (ఫ్రాన్స్)పై విజయం సాధించాడు. ఈ మ్యాచ్‌లో జ్వెరెవ్‌కు ప్రత్యర్థి నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురు కాలేదు. అయిదుసార్లు బోంజి సర్వీసును బ్రేక్ చేసిన జ్వెరెవ్.. అయిదు ఏస్‌లు కొట్టాడు. 13వ సీడ్ కచనోవ్ (రష్యా) రెండో రౌండ్లో ప్రవేశించాడు. మొదటి రౌండ్లో అతడు 63, 76 (73), 60తో ఆర్థర్ గెయా (ఫ్రాన్స్)ను ఓడించాడు. దేవిడోవిచ్ (స్పెయిన్), మహక్ (చెక్), బోర్జెస్ (పోర్చుగల్) కూడా తొలి రౌండ్లో విజయాలు నమోదు చేశారు. మహిళల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ మిరా ఆంద్రీవా ముందంజ వేసింది. తొలి రౌండ్లో ఈ రష్యా అమ్మాయి 63, 63తో ఫెరో (ఫ్రాన్స్)ను ఓడించింది. మ్యాచ్‌లో ఆంద్రీవా 11 విన్నర్లు కొట్టింది. నాలుగుసార్లు ప్రత్యర్థి సర్వీసును బ్రేక్ చేసింది. మరో మ్యాచ్‌లో పదకొండో సీడ్ బెన్సిచ్ (స్విట్జర్లాండ్) 62, 63తో సింజా క్రాస్ (ఆస్ట్రియా)ను ఓడించింది. మ్యాచ్‌లో బెన్సిచ్ ఒక ఏస్‌తో పాటు 23 విన్నర్లు కొట్టింది. బాప్టిస్ట్ (అమెరికా), కొస్త్యూక్ (ఉక్రెయిన్), మెకన్లీ (అమెరికా), బౌజ్కోవా (చెక్), లినెట్ (పోలెండ్) కూడా తొలి రౌండ్‌ను అధిగమించారు.

రాజస్థాన్‌దే ఆఖరి అడుగు

ప్లేఆఫ్స్‌లోకి రాయల్స్
ముంబయిపై విజయం
ఆర్చర్ ఆల్‌రౌండ్ ప్రదర్శన పంజాబ్, కోల్‌కతా ఔట్

ధనాధన్ ఆటలో ఓ అంకం ముగిసింది. ఐపీఎల్-19 లీగ్ దశ పూర్తయింది. స్ఫూర్తిదాయక ప్రదర్శన చేసిన రాజస్థాన్ రాయల్స్.. ఆఖరి ప్లేఆఫ్స్ బెర్తును ఎగరేసుకుపోయింది. తన చివరి లీగ్ మ్యాచ్‌లో ముంబయిని ఓడించిన ఆ జట్టు.. 16 (8 విజయాలు) పాయింట్లతో నాలుగో స్థానంలో నిలిచింది. ఎలాంటి సమీకరణాలతో సంబంధం లేకుండా ముందంజ వేసింది. పంజాబ్ కింగ్స్‌కు నిరాశ తప్పలేదు. రాయల్స్ ఓడిపోయుంటే ఆ జట్టుకు మార్గం సుగమమయ్యేది. కానీ 15 పాయింట్లతో నిష్క్రమించక తప్పలేదు. తొలి ఏడు మ్యాచ్‌ల్లో ఓటమనేదే లేకుండా సాగిన పంజాబ్.. ప్లేఆఫ్స్‌కు చేరలేకపోవడం విచిత్రమే.

మరోవైపు కోల్‌కతా నైట్‌రైడర్స్ కథ కూడా ముగిసింది. ఆ జట్టు ఆఖరి లీగ్ మ్యాచ్‌లో దిల్లీ క్యాపిటల్స్ చేతిలో పరాజయంపాలైంది. ఒకవేళ గెలిచినా ఎలాంటి ప్రయోజనం ఉండేది కాదు. అంతకుముందు రాజస్థాన్ విజయంతో కోల్‌కతా × దిల్లీ పోరు నామమాత్రమే అయింది. కోల్‌కతా 13 పాయింట్లతో టోర్నీని ముగించింది. ఏడు విజయాలు సాధించిన దిల్లీ ఆరో స్థానంలో నిలిచింది. ఇక అభిమానుల కళ్లన్నీ ప్లేఆఫ్స్‌పైనే. మంగళవారం ధర్మశాలలో జరిగే క్వాలిఫయర్ 1లో టాప్ 2 జట్లు ఆర్సీబీ, గుజరాత్ తలపడతాయి. బుధవారం న్యూ చండీగఢ్ వేదికగా ఎలిమినేటర్‌లో సన్‌రైజర్స్‌ను రాజస్థాన్ ఢీకొంటుంది. శుక్రవారం క్వాలిఫయర్ 2 జరుగుతుంది. రాజస్థాన్ రాయల్స్ అదరగొట్టింది. ప్లేఆఫ్స్ చేరాలంటే తప్పక నెగ్గాల్సిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆ జట్టు సత్తా చాటింది. జోఫ్రా ఆర్చర్ ఆల్‌రౌండ్ మెరుపులతో ముంబయి ఇండియన్స్‌ను ఓడించింది. జురెల్, బర్గర్, బ్రిజేశ్, యశ్‌రాజ్ కూడా రాజస్థాన్ విజయంలో కీలక పాత్ర పోషించారు. రాజస్థాన్‌దే ఆఖరి పంచ్! సమష్టి ప్రదర్శన చేసిన ఆ జట్టు 30 పరుగుల తేడాతో ముంబయిపై గెలిచి టాప్ 4లో చోటు దక్కించుకుంది. ఆదివారం మొదట రాజస్థాన్ 8 వికెట్లకు 205 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్ (38; 26 బంతుల్లో 3×4, 2×6), ఆర్చర్ (32; 15 బంతుల్లో 1×4, 3×6) విలువైన ఇన్నింగ్స్ ఆడారు. ఛేదనలో ఆర్చర్ (3/17) విజృంభించడంతో ముంబయి 20 ఓవర్లలో 9 వికెట్లకు 175 పరుగులే చేసింది. బర్గర్ (2/43), బ్రిజేశ్ (2/26), యశ్‌రాజ్ (2/44) కూడా బంతితో రాణించారు. ముంబయి జట్టులో సూర్యకుమార్ (60; 42 బంతుల్లో 3×4, 4×6), హార్దిక్ (34; 15 బంతుల్లో 3×4, 2×6), జాక్స్ (33; 18 బంతుల్లో 3×4, 2×6) మాత్రమే పోరాడారు.

ఆర్చర్ దెబ్బ: ఛేదనలో ముంబయి సైతం ఆరంభంలో తడబడింది. పేసర్ ఆర్చర్ విజృంభించడంతో 38 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి కష్టాల్లో చిక్కుకుంది. తొలి ఓవర్లోనే రోహిత్‌ను డకౌట్ చేసిన ఆర్చర్.. తన రెండో ఓవర్లో నమన్ ధీర్ (6) కథ ముగించాడు. రికెల్టన్ (12), తిలక్ వర్మ (3) కూడా పెవిలియన్ చేరిపోవడంతో ముంబయి ఇబ్బందుల్లో చిక్కుకుంది. ఈ స్థితిలో ఈ సీజన్లో పెద్దగా రాణించని సూర్యకుమార్ నిలిచాడు. దూకుడుగా ఆడుతూ స్కోరు పెంచాడు. విల్ జాక్స్ కూడా జోరందుకోవడంతో 10 ఓవర్లకు 90/4తో ముంబయి పుంజుకుంది. జాక్స్ ఔటైనా.. హార్దిక్ విరుచుకుపడ్డాడు. దీంతో ముంబయి సాధించాల్సిన రన్‌రేట్ అదుపులోకి వచ్చింది. మరోవైపు ధాటిని కొనసాగించిన సూర్య 32 బంతుల్లో అర్ధ సెంచరీ అందుకున్నాడు. 15 ఓవర్లకు 147/5తో ముంబయి లక్ష్యం వైపు వెళ్తున్నట్లు కనిపించింది.

కానీ 16వ ఓవర్లో హార్దిక్‌ను ఔట్ చేసిన ఆర్చర్.. 3 పరుగులే ఇచ్చి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. సమీకరణం 24 బంతుల్లో 56 పరుగులుగా ఉన్న స్థితిలో బోష్ (2) కూడా ఔటైపోవడంతో ముంబయిపై ఒత్తిడి పెరిగిపోయింది. తర్వాత సూర్యను బర్గర్ పెవిలియన్ చేర్చడంతో ముంబయి పనైపోయింది.

రాజస్థాన్ తడబడినా..: ఎన్నో ఆశలు పెట్టుకున్న వైభవ్ సూర్యవంశీ (4) స్వల్ప స్కోరుకే ఔటైపోయాడు. 54 పరుగులకే 3 వికెట్లు పడిపోయాయి! అయినా రాజస్థాన్ స్కోరు 200 దాటింది. బ్యాటర్లు తలోచేయి వేయడమే ఇందుకు కారణం. రాజస్థాన్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. గొప్ప ఆరంభమేమీ దక్కలేదు. జైస్వాల్ (27; 17 బంతుల్లో 1×4, 3×6), వైభవ్‌తో తొలి వికెట్‌కు 3.4 ఓవర్లలో 33 పరుగులు జోడించినా.. అందులో వైభవ్ చేసింది 4 పరుగులే. ఈ స్థితిలో రాజస్థాన్‌కు డబుల్ షాక్ తగిలింది. జైస్వాల్‌తో పాటు వైభవ్ ఓవర్ తేడాతో డగౌట్ చేరిపోయారు. జైస్వాల్‌ను జాక్స్.. వైభవ్‌ను దీపక్ చాహర్ ఔట్ చేశారు. పరాగ్ (14) కూడా నిలవలేదు. ఈ స్థితిలో జురెల్, శానక (29; 15 బంతుల్లో 3×6) వికెట్ల పతనాన్ని ఆపారు. శానక సిక్స్‌ల వేటలో సాగడంతో 10 ఓవర్లకు 94/3తో రాజస్థాన్ కోలుకుంది. శానక ఔటైనా.. జురెల్ దూకుడు కొనసాగించడంతో ఆ జట్టు స్కోరు తగ్గలేదు. ఘజన్‌ఫర్ వేసిన 12వ ఓవర్లో 2 ఫోర్లు, ఓ సిక్స్ బాదిన జురెల్.. ఆ తర్వాత బోష్ ఓవర్లో వెనుదిరిగాడు. ఫెరీరా (18) కూడా నిలవక పోవడంతో రాజస్థాన్ ఓ మోస్తరు స్కోరైనా చేస్తుందా అనిపించింది. 16వ ఓవర్లో జట్టు స్కోరు 139 వద్ద ఫెరీరా ఔటయ్యాడు. కానీ ఆర్చర్ అనూహ్యంగా చెలరేగాడు. ఎడాపెడా షాట్లు ఆడి స్కోరు పెంచాడు. జడేజా (19 నాటౌట్), బర్గర్ (10 నాటౌట్) కూడా ఓ చేయి వేయడంతో రాయల్స్ స్కోరు 200 దాటింది.

రాజస్థాన్ ఇన్నింగ్స్: జైస్వాల్ (సి) బోష్ (బి) జాక్స్ 27; వైభవ్ (సి) ధీర్ (బి) చాహర్ 4; జురెల్ (బి) బోష్ 38; పరాగ్ (సి) తిలక్ (బి) ఘజన్‌ఫర్ 14; శానక రనౌట్ 29; ఫెరీరా (సి) బోష్ (బి) చాహర్ 18; ఆర్చర్ (సి) తిలక్ (బి) శార్దూల్ 32; శుభమ్ (సి) ధీర్ (బి) శార్దూల్ 5; జడేజా నాటౌట్ 19; బర్గర్ నాటౌట్ 10; ఎక్స్‌ట్రాలు 9 మొత్తం: (20 ఓవర్లలో 8 వికెట్లకు) 205; వికెట్ల పతనం: 133, 233, 354, 499, 5119, 6139, 7174, 8175; బౌలింగ్: దీపక్ 40432; జాక్స్ 20121; ఘజన్‌ఫర్ 30451; రఘు 3-0-25-0; శార్దూల్ 4-0-41-2; బోష్ 4-0-38-1

ముంబయి ఇన్నింగ్స్:
రోహిత్ (సి) జురెల్ (బి) ఆర్చర్ 0; రికెల్టన్ (సి) వైభవ్ (బి) బర్గర్ 12; ధీర్ (బి) ఆర్చర్ 6; సూర్యకుమార్ (సి) అండ్ (బి) బర్గర్ 60; తిలక్ (సి) బ్రిజేశ్ 3; జాక్స్ (సి) జురెల్ (బి) యశ్‌రాజ్ 33; హార్దిక్ (సి) బర్గర్ (బి) ఆర్చర్ 34; బోష్ (సి) ఫెరీరా (బి) యశ్‌రాజ్ 2; శార్దూల్ నాటౌట్ 10; దీపక్ ఎల్బీ (బి) బ్రిజేశ్ 8; ఘజన్‌ఫర్ నాటౌట్ 2; ఎక్స్‌ట్రాలు 5 మొత్తం: (20 ఓవర్లలో 9 వికెట్లకు) 175; వికెట్ల పతనం: 10; 218, 324, 438, 5101, 6149, 7152, 8158, 9167; బౌలింగ్: ఆర్చర్ 40173; బర్గర్ 40432; బ్రిజేశ్ 40 262; జడేజా 2-0-24-0; యశ్‌రాజ్ 4-0-44-2; శానక 2-0-21-0

దిల్లీ ముగించింది విజయంతో..

రాణించిన రాహుల్, కుల్‌దీప్
కోల్‌కతా పరాజయం

ఈ ఐపీఎల్ సీజన్‌ను దిల్లీ క్యాపిటల్స్ విజయంతో ముగించింది. ముంబయిపై గెలిచి రాజస్థాన్ ప్లేఆఫ్స్ చేరడంతో ప్రాధాన్యత కోల్పోయిన మ్యాచ్‌లో దిల్లీ 40 పరుగుల తేడాతో కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ఓడించింది. మొదట దిల్లీ 5 వికెట్లకు 203 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (60; 30 బంతుల్లో 5×4, 4×6) టాప్ స్కోరర్. అక్షర్ పటేల్ (39), డేవిడ్ మిల్లర్ (28), అభిషేక్ పోరెల్ (22) కూడా రాణించారు. సౌరభ్ దూబె (2/28) ఆకట్టుకున్నాడు. ఛేదనలో కోల్‌కతా 18.4 ఓవర్లలో 163 పరుగులకే ఆలౌటైంది. కెప్టెన్ అజింక్య రహానె (63; 39 బంతుల్లో 4×4, 4×6) మాత్రమే పోరాడాడు. కుల్‌దీప్ యాదవ్ (3/29), ఎంగిడి (3/27), స్టార్క్ (2/26) కేకేఆర్‌ను దెబ్బతీశారు.

రహానె బాదినా..: భారీ ఛేదనలో కోల్‌కతా దీటుగా ఆడింది. ఓపెనర్లు రహానె, అలెన్ (20; 13 బంతుల్లో 3×4, 1×6) తొలి వికెట్‌కు 4.2 ఓవర్లలోనే 43 పరుగులు జత చేసి మెరుపు ఆరంభం అందించారు. అకిబ్ నబి వేసిన నాలుగో ఓవర్లో రహానె వరుసగా రెండు సిక్స్‌లు బాదాడు. అలెన్ వెనుదిరిగినా.. మనీష్ పాండే (25; 16 బంతుల్లో 2×4, 2×6) జతగా రహానె దూకుడు కొనసాగించాడు. అక్షర్ పటేల్ వేసిన ఎనిమిదో ఓవర్లో ఈ జంట చెలరేగిపోయింది. ఈ ఓవర్లో రహానె రెండు, పాండే ఒక సిక్స్ బాదడంతో 21 పరుగులొచ్చాయి. 8 ఓవర్లకు 85/1తో కోల్‌కతా లక్ష్యం దిశగా సాగింది. అయితే ఓవర్ తేడాతో పాండే, గ్రీన్ (2) ఔట్ కావడంతో కేకేఆర్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఒకవైపు వికెట్లు పడుతున్నా రహానె ఆగలేదు. 31 బంతుల్లోనే అతడు అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతడికి తోడు రోమన్ పావెల్ కూడా దూకుడుగా ఆడడంతో కోల్‌కతా 13 ఓవర్లకు 126/3తో నిలిచింది. అయితే తర్వాతి ఓవర్లో రహానె, రింకు సింగ్ (0)లను వరుస బంతుల్లో ఔట్ చేసిన కుల్‌దీప్.. కోల్‌కతాను ఒత్తిడిలోకి నెట్టాడు. ఆపై రోమన్ పావెల్ (29; 21 బంతుల్లో 3×4, 1×6) పోరాటం ఓటమి అంతరాన్ని మాత్రమే తగ్గించగలిగింది.

మెరిసిన రాహుల్: మొదట బ్యాటింగ్‌కు దిగిన దిల్లీకి అభిషేక్ పోరెల్ తొలి ఓవర్లో రెండు ఫోర్లు బాదేశాడు. గ్రీన్ బౌలింగ్‌లో సిక్స్, ఫోర్‌తో రాహుల్ (60; 30 బంతుల్లో 5×4, 4×6) కూడా లయ అందుకున్నాడు. కానీ అయిదో ఓవర్లో వికెట్ కీపర్ దహియా పట్టిన చక్కటి క్యాచ్‌కు పోరెల్ (22) వెనుదిరగడంతో కేకేఆర్‌కు బ్రేక్ దొరికింది. పవర్‌ప్లేలో 53/1తో పర్వాలేదనిపించింది డీసీ. ఫామ్‌ను కొనసాగిస్తూ రాహుల్ చక్కటి షాట్లతో అలవోకగా పరుగులు రాబట్టాడు. సాహిల్ పరాఖ్ (24) తోడుగా స్కోరు బోర్డును నడిపించాడు. వరుణ్ చక్రవర్తి బౌలింగ్‌లో రెండు ఫోర్లు బాది ఊపు మీద కనిపించిన పరాఖ్.. నరైన్ మిస్టరీకి చిక్కాడు. ఎక్స్‌ట్రా కవర్లో క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. 10 ఓవర్లలో క్యాపిటల్స్ 88/2తో మంచి స్కోరు దిశగా సాగింది. 11వ ఓవర్లో త్యాగికి దిల్లీ బ్యాటర్లు చుక్కలు చూపించారు. మొదట రాహుల్ 4, 6 బాది సీజన్లో అయిదో అర్ధసెంచరీ (25 బంతుల్లో) పూర్తి చేసుకున్నాడు. పరాఖ్ నిష్క్రమణతో క్రీజులో కొచ్చిన కెప్టెన్ అక్షర్ పటేల్ (39; 25 బంతుల్లో 3×4, 2×6) రెండు ఫోర్లు కొట్టడంతో ఆ ఓవర్లో 20 పరుగులు వచ్చాయి. అయితే పదే పదే వైడ్ లైన్ బంతులేసిన అనుకుల్ రాయ్.. రాహుల్‌ను ఔట్ చేయడంలో సఫలమయ్యాడు. అప్పటికి డీసీ 125/3తో పటిష్ఠ స్థితిలో నిలిచింది. రాహుల్ ఔటయ్యాక పరుగుల వేగం కాస్త మందగించింది. 14, 15 ఓవర్లలో కలిపి 13 పరుగులు మాత్రమే వచ్చాయి. వరుణ్ వేసిన 17వ ఓవర్లో రెండు సిక్సర్లు బాదిన అక్షర్.. అదే ఓవర్ అయిదో బంతికి ఔటయ్యాడు. అశుతోష్ శర్మ (18 నాటౌట్) వేగంగా ఆడాడు. డేవిడ్ మిల్లర్ (28; 19 బంతుల్లో 3×6) ఆఖరి ఓవర్లో సౌరభ్ దూబెకు రెండు సిక్సర్లు వడ్డించి క్యాపిటల్స్‌ను 200 దాటించాడు.

దిల్లీ ఇన్నింగ్స్: పోరెల్ (సి) తేజస్వి (బి) సౌరభ్ 22; కేఎల్ రాహుల్ (సి) పావెల్ (బి) అనుకుల్ 60; సాహిల్ (సి) రహానె (బి) నరైన్ 24; అక్షర్ (సి) రింకు (బి) వరుణ్ 39; మిల్లర్ (సి) అలెన్ (బి) సౌరభ్ 28; అశుతోష్ నాటౌట్ 18; స్టబ్స్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 12, మొత్తం: (20 ఓవర్లలో 5 వికెట్లకు) 203; వికెట్ల పతనం: 140, 287, 3125, 4166, 5-20-1; బౌలింగ్: అనుకుల్ 2-0-23-1; సౌరభ్ 4-0-28-2; గ్రీన్ 2-0-21-0; త్యాగి 4-0-55-0; నరైన్ 4-0-38-1; వరుణ్ 4-0-35-1

కోల్‌కతా ఇన్నింగ్స్: రహానె (సి) మిల్లర్ (బి) కుల్‌దీప్ 63; అలెన్ (బి) ఎంగిడి 20; మనీశ్ (సి) స్టార్క్ (బి) ఎంగిడి 25; గ్రీన్ (సి) మిల్లర్ (బి) కుల్‌దీప్ 2; పావెల్ రనౌట్ 29; రింకు (సి) స్టబ్స్ (బి) కుల్‌దీప్ 0; తేజస్వి (బి) అక్షర్ 1; అనుకుల్ (సి) అండ్ (బి) స్టార్క్ 9; త్యాగి (సి) అక్షర్ (బి) స్టార్క్ 0; వరుణ్ (సి) అక్షర్ (బి) ఎంగిడి 5; సౌరభ్ నాటౌట్ 4; ఎక్స్‌ట్రాలు 5, మొత్తం: (18.4 ఓవర్లలో ఆలౌట్) 163; వికెట్ల పతనం: 143, 287, 396, 4128, 5128, 6129, 7154, 8154, 9155; బౌలింగ్: స్టార్క్ 30262; అకిబ్ నబి 20 230; ఎంగిడి 3.4-0-27-3; అక్షర్ 4-0-38-1; మాధవ్ 2-0-20-0; కుల్‌దీప్ 4-0-29-3